



# సాయి సూర్య

తెలుగు దిన పత్రిక

www.saisuryaa.com T/TG/2024/1225/9690/1229








ప్రచురణ: హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 30 ఎడిటర్ : పాలగోని రాజేష్ శుక్రవారం 28 -03-2025 పేజీలు : 8 వెల : 4-00


## పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన అప్పు 4.17లక్షల కోట్లే

- పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన అప్పు 4.17లక్షల కోట్లే
- కాగ్ రిపోర్ట్, ఆర్థిక మంత్రి భట్టి ఇదే చెప్పారు
- ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కడిగిపారేశాం
- మేమడిగిన ప్రశ్నలకు సమాధానాలు దాటవేశారు
- డీలిమిటేషన్‌పై చర్చించకుండా తోకముడిచారు
- నీళ్ల లెక్కలు చెప్పమంటే మంత్రి నీళ్లు నమిలారు
- అసెంబ్లీ, మీడియా పాయింట్‌లో మాజీ మంత్రి హరీశ్

మిగతా 2లో



## వందశాతం రుణామఫీ

# నిరూపిస్తారా?

- మహిళలకు తులం బంగారం హామీ ఏమయ్యింది.
- దొడ్డువడ్లకు 500 బోనస్ ఎక్కడ పోయింది
- బిఆర్ఎస్ రాష్ట్రాన్ని అభివృద్ది చేసి పెట్టింది
- ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో కెటిఆర్



హైదరాబాద్**సాయి సూర్య**

కొండారెడ్డి పల్లి పోదామా.. కొడంగల్ పోదామా..? రాష్ట్రంలో ఏ గ్రామంలోనైనా వందశాతం రుణమాఫీ అయ్యిందని నిరుపిస్తారా..? అంటూ అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా కేటీ-ఆర్ మాట్లాడారు. ఒకవేళ రుణమాఫీ 100 శాతం పూర్తి అయినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకుంటానని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ అసెంబ్లీలో సవాల్ విసిరారు. రైతు భరోసా కింద రైతులకు రూ.15 వేలు ఇస్తామని చెప్పలేదా..? మహిళలకు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. దొడ్డు వడ్లకు కూడా క్వింటాకు రూ.500 వంద బోనస్ ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పారు.. కానీ ఎన్నికల తర్వాత మాట మార్చి కేవలం సన్న వడ్లకే ఇస్తామని కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉప్పు - నిప్పులాగా కొట్లాడుకుంటాం.. కానీ చెన్నైలో సీఎం రేవంత్ రెడ్డిని గౌరవించానని, అది నా సంస్కారం అని కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి ఒక్కటి చెప్పదలచుకున్నా.. మీరు నేను చెన్నై మీటింగ్‌కు వెళ్లాం. అక్కడ మీరు ఒక ప్రతిపాదన పెట్టారు. నేను మీ పార్టీ వ్యక్తిని కాదు.. ఇక్కడ ఉప్పు నిప్పులాగా కొట్లాడుకుంటాం.. కానీ నేను మిమ్మల్ని గౌరవించి.. మా సీఎం చెప్పిన మాట

# పది నెలల్లో రూ.20,616 కోట్లు మాఫీ చేశాం



- కక్ష సాధించే వాడినైతే.. కుటుంబమంతా జైల్లోనే!
- ఇవాళ అసెంబ్లీలో కూర్చుని మాట్లాడేవారు కాదు
- ఎంపీని 16 రోజులు ఒంటరిగా బంధించారు
- జైల్లో రాత్రి నిద్ర పోకుండా లైట్లు వేసి వేధించారు
- పదేళ్లలో బీఆర్ఎస్ రుణమాఫీ రూ.16,908 కోట్లే
- పదేళ్ల పాలనను మా పది నెలలతో పోల్చండి
- కేటీఆర్, హరీశ్ రావులకు పార్టీ కుర్చీపై ఆశ

మిగతా 2లో

హైదరాబాద్, **సాయి సూర్య**తనది కక్ష సాధించే మనస్తత్వమే అయితే మొత్తం కేసీఆర్ కుటుంబం ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉండేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

గురువారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి కక్ష, పగ, ప్రతీకారాలకు పోతున్నారని బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన ఆరోపణలపై సీఎం తీవ్రంగా స్పందించారు. తాము నిజంగా కక్ష సాధింపునకు పాల్పడితే బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీలో కూర్చుని నోటికొచ్చి నట్లు మాట్లాడేవారు కాదని వ్యాఖ్యానించారు. తనను ఉంచిన చంచల్‌గూడ జైల్లోనో, చర్లపల్లి జైల్లోనే ఉండేవారని అన్నారు. "డ్రోన్ ఎగరేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. బీఆర్ఎస్ వాళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎంపీనని కూడా చూడకుండా నన్ను చర్లపల్లి జైల్లో పెట్టారు. కరడు గట్టిన నేరగాళ్లను బంధించినట్లు బంధించారు.

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను బెదిరించిన వ్యక్తికి బెయిల్

- క్వాష్ పిటిషన్‌లో హైకోర్టు బెయిల్.. కేసు కొట్టివేతకు నిరాకరణ
- దర్యాప్తు చేపట్టాలని నిర్దేశం
- ఏడేళ్లలోపు శిక్ష పడే కేసులో రిమాండ్‌కు పంపడంపై ఆగ్రహం
- దర్యాప్తు అధికారి, మెజిస్ట్రేట్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశం



హైదరాబాద్, **సాయి సూర్య**

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఇంటర్నెట్ కాల్ ద్వారా బెదిరించిన యాస అఖిలేశ్ రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అఖిలేశ్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కేసు కొట్టివేతకు నిరాకరించిన ధర్మాసనం.. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి నిందితుడికి బెయిల్ మంజూరు చేసింది. చట్టప్రకారం కేసు దర్యాప్తు కొనసాగించాలని పోలీసులకు ఆదేశాలు జారీచేసింది.

## కక్షతో గత ప్రభుత్వం పోలవరం

# ప్రాజెక్టుకు నష్టం కలిగించింది

- పోలవరం నా సెంటిమెంట్
- ప్రాజెక్టు దుస్థితి చూసి బాధపడ్డాను
- రివర్స్ టెండర్ వల్ల రూ.2,782 కోట్లు అదనపు భారం
- పరిస్థితులు చక్కదిద్ది 9 నెలల్లోనే ప్రాజెక్టును గాడినపెట్టాం
- 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేస్తాం
- పోలవరం-బనకచర్ల అనుసంధానం చేపడతాం
- ముఖ్యమంత్రి చంద్రబాబ నాయుడు



పోలవరం, **సాయి సూర్య**

పోలవరం ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం క్షమించరాని తప్పులు చేసింది. కక్ష, అహంభావంతో ఇష్టానుసారంగా వ్యవహరించింది. ప్రాజెక్టు విషయంలో తొందరపడొద్దని పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్రం చెప్పినా వినకుండా వారికి నచ్చినట్లు ప్రవర్తించారు. రివర్స్ టెండర్ పేరుతో రాజకీయం చేశారు. దీని వల్ల రూ.2,782 కోట్లు అదనపు భారం పడింది. కాంట్రాక్టర్లను మార్చారు. 6 నెలల పాటు ప్రాజెక్టును పట్టించుకోలేదు. ప్రాజెక్టు దుస్థితి చూసి

- మిగతా 2లో పేజిలో



## అక్రమ వలసదారుకలు ఇదేమీ ధర్మసత్రం కాదు

- చట్టబద్ధంగా వచ్చే వారికి స్వాగతం పలుకుతాం
- దేశాభివృద్ధికి సహకరించే వారికి మద్దతు ఉంటుంది
- ఇమ్మిగ్రేషన్ బిల్లుపై చర్చలో హోంమంత్రి అమిత్ షా

2లో

సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
శుక్రవారం 28 మార్చి 2025

# పది నెలల్లో రూ.20,616 కోట్లు మాఫీ చేశాం

(మొదటి పేజి (తరువాయి)

16 రోజులపాటు కంటికి మనిషి కనిపించకుండా నక్సల్స్‌ను ఉంచే డిటెన్షన్ సెల్లో ఉంచారు. ఆ కోపాన్ని కూడా బిగపట్టుకున్నా తప్ప కక్ష సాధింపునకు పాల్పడలేదు. జైల్లో రాత్రంతా లైట్లు ఆన్‌లో పెట్టి ఒక్క రాత్రి కూడా పడుకోకుండా చేశారు. దీపాల వెలుగుకు బల్లులు, పురుగులు వచ్చి చేరడంతో బలవంతంగా కళ్లు మూసుకున్నా నిద్ర వచ్చేది కాదు. దాంతో పగలు చెట్టు కింద పడుకుని నిద్రపోయే వాడిని. వాళ్ల తప్పులను దేవుడే చూస్తాడని, అంతకు అంత అనుభవిస్తారని భావించి ఊరుకున్నా. నా మీద కక్ష చూపిన వారిని దేవుడే ఆసుపత్రి పాలు చేశాడు" అన్నారు. 2015లో చంచల్‌గూడ జైల్లో ఉన్నపుడు తన బిడ్డ లగ్నపత్రిక రాసుకోవడానికి బెయిలు కోసం ప్రయత్నిస్తుంటే ఢిల్లీ నుంచి న్యాయవాదులను పిలిపించి వాదనలు చేసి అడ్డుకున్నారని గుర్తు చేశారు. రాజకీయ కక్ష సాధింపులంటే మీవి కదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఇంత జరిగినా కక్ష సాధింపులకు పాల్పడకుండా విజ్ఞత ప్రదర్శించామని చెప్పారు. కేటీఆర్ సొంత పార్టీ ఆఫీసులో కొంత మందికి డబ్బులు ఇచ్చి తనను, తన కుటుంబ సభ్యులను బూతులు తిట్టించి,



రికార్డు చేయించిన వారిని చెంప పగులగొట్టే శక్తి ఉన్నా సంయమనంతో వ్యవహరిస్తున్నానన్నారు. ఎవరివి కక్ష సాధింపు చర్యలో తెలంగాణ సమాజం గమనిస్తోందని వ్యాఖ్యానించారు.

### గుంటూరు తెలివితేటలొద్దు

ఆ తర్వాత బడ్జెట్‌పై చర్చలో చివరగా ముఖ్యమంత్రి మాట్లాడినపుడు కూడా కేటీఆర్‌పై ఎదురుదాడికి దిగారు. ఇంగ్లిష్ అనేది భాషే తప్ప జ్ఞానం కాదన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న చైనా, జపాన్, జర్మనీల్లో ఉండే వారికి ఇంగ్లిష్ రాదని చెప్పారు. కేటీఆర్ నేర్చుకున్న నాలుగు ఇంగ్లిష్ ముక్కలు హోటల్‌లో ఆర్డర్ తీసుకునేందుకు, బట్టల దుకాణంలో బట్టలు అమ్మేందుకు అక్కరకు రావొచ్చరన్నారు. గుంటూరులో చదివిన తెలివితేటలు తమ వద్ద చూపించొద్దని హెచ్చరించారు. తెలుగు మీడియంలో గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని వచ్చానని, లోకల్ పరిజ్ఞానంతో పని చేస్తున్నానని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో చదువుకొని, రైతు కుటుంబం నుంచి వచ్చిన వాడు ముఖ్యమంత్రి సీట్లో కూర్చుంటే ఎందుకు కళ్లలో నిప్పులు పోసుకుంటారని ప్రశ్నించారు. ఈ ఐదేళ్ల తర్వాత రెండోసారి కూడా తామే అధికారానికి వస్తామని రేవంత్ అన్నారు. పార్టీ అధినేతగా కేసీఆర్ కుర్చీ మీద కేటీఆర్, హరీశ్ కన్నేయడం భావ్యం కాదని వ్యాఖ్యానించారు. కుటుంబంలో పెద్ద దిక్కు ఉంటేనే ఆ కుటుంబానికి గౌరవం ఉంటుందని, ఆయన్ను ఖతం చేసి కుర్చీలో కూర్చొనే పథకాలు వేయొద్దని సూచించారు. గతంలో నేపాల్ యువరాజు దీపేంద్ర తనకు పదవి ఇవ్వలేదనే కోపంతో కుటుంబంలో 8 మందిని ఏకే 47తో కాల్చేశారని, అలాంటి పరిస్థితులు రాష్ట్రంలో రాకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి స్పీకర్‌ను కోరారు. రాష్ట్రంలో ఏ ఊరిలో పంట పండినా అది కాళేశ్వరం నీటితోనే పండిందని చెప్పే స్థాయిలో తప్పు ప్రచారం చేస్తున్నారని సీఎం మండిపడ్డారు.

# వందశాతం రుణామఫీ నిరూపిస్తారా?

(మొదటి పేజి (తరువాయి)

కరెక్ట్ అని 33 శాతం కాదు 36 శాతం ఇవ్వొచ్చని చెప్పాను. ఎందుకంటే నాకు ఆ సంస్కారం ఉంది. ఎందుకంటే నీవు మా ముఖ్యమంత్రివి కాబట్టి.. హద్దులు, సరిహద్దులు దాటిన తర్వాత నిన్ను కాపాడాలి.. నిన్ను గౌరవించాలి.. అది నా బాధ్యత అని కేటీఆర్ తెలిపారు. అలాగే కేంద్రం చేస్తున్న అక్రమాలపై నిలదీయాల్సిందేనని అన్నారు. గత పదేళ్లుగా బిఆర్ఎస్ హయాంలోనూ కేంద్రంతో సఖ్యతగా ఉన్నా దక్కిందేమీ లేదన్నారు. ఓ స్త్రీ రేపు రా' మాదిరి కాంగ్రెస్ పరిపాలన ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. తెల్లారి లేస్తే ప్రజాపాలన అంటారు. కానీ నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందో.. మీ ప్రజా పాలనలో ప్రజాస్వామిక స్ఫూర్తి కూడా అంతే ఉంది. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామంటున్నరు. కానీ అత్తాకోడల్లకు పంచాయతీ పెట్టారు. తులం బంగారం, ఆసరా పెన్షన్ల కోసం అత్తాకోడళ్ల మధ్య గొడవలు జరుగుతున్నాయి. అప్పట్లో ఊర్లల్లో గోడల మీద రాసేది ఓ స్త్రీ రేపు రా అని.. ఇవాళ వీళ్ల పరిపాలన కూడా అట్లనే ఉంది. ఏది అడిగినా ఓ స్త్రీ రేపు రా.. మహిళలను కోటీశ్వరులను చేస్తారంటా.. ఎట్ల చేస్తారో తెలియదు కానీ.. 40 శాతం బడ్జెట్‌ను చూసిన తర్వాత ప్రజలకు అర్థమైంది వీళ్ల పాలన అని కేటీ-ఆర్ పేర్కొన్నారు. రూ. 2500 కోసం ఆడబిడ్డలు ఎదురు

చూస్తున్నారు. బంగారం అన్నారు.. లంకె బిందెలు దొరికినక ఇస్తారా..? కేసీఆర్ కిట్ బంద్ అయిపోయింది. న్యూట్రిషన్ కిట్ ఆగిపోయింది. బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా బంద్, ఆశాలు, అంగన్‌వాడీ కార్మికులను మోసం చేశారు. ఇంచా చాలా ఉన్నాయి.. -క్రై-మ్ రేట్ పెరిగిపోతోందని డీజీపీనే స్వయంగా చెప్పారు. ప్రోటోకాల్ వయిలేషన్స్ కూడా జరుగుతున్నాయని కేటీ-ఆర్ పేర్కొన్నారు. హరీశ్‌రావు మీద పెట్రోల్ పోసి చంపేస్తా అని కాంగ్రెస్ నాయకుడు అంటడు.. కానీ చర్యలు, కేసులు ఉండవు. కానీ మా మీద కేసులు, చర్యలు ఉంటాయి. ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీ, ఐఆర్ పెండింగ్‌లో ఉన్నాయి. ఐఆర్ అంటే ఇప్పట్లో రాదు.. డీఏ అంటే దయచేసి అడగొద్దు.. పీఆర్సీ అంటే పనికి రాని చర్చలు అని ఉద్యోగులు అనుకుంటున్నారు. అలా పరిస్థితి అయిపోయింది. ఓల్డ్ పెన్షన్ స్కీం ఎప్పుడు తెస్తారో చెప్పాలి. వ్యవసాయ విస్తరణ అధికారులను, పోలీసులను సస్పెండ్ చేశారు.. ప్రజాపాలన ఇలా ఉందంటూ కేటీ-ఆర్ తీవ్రంగా విమర్శించారు. ఇక్కడ సభలో అంత ఫ్రస్టేషన్ ఉంటే కుదరదు. రంకెలు వేస్తామంటే కుదరదు. ప్రతిపక్షాల మీద మాటలతోని డైలాగులతో దాడి చేస్తా అంటే కుదరదు. పరిపాలన అంటే పంచ్ డైలాగులు కాదు. పరిపాలన అంటే మీరు చెప్పిన కష్టాలన్నీ ఉంటాయి. 2014లో కూడా కష్టాలతోనే ప్రారంభించాం.

# కక్షతో గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు నష్టం కలిగించింది

(మొదటి పేజి (తరువాయి)

రాష్ట్రంలో బాధపడిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది నేనే. పోలవరం ప్రాజెక్టు నా సెంటిమెంట్' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను గురువారం సీఎం పరిశీలించారు. అనంతరం అక్కడే అధికారులతో సమీక్ష నిర్వహించి, మీడియాతో మాట్లాడారు.

### 9 నెలల్లోనే 3 సార్లు పరిశీలించా

'ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక 3వసారి పోలవరం ప్రాజెక్టును పరిశీలించడానికి వచ్చాను. 9 నెలల్లోనే ప్రాజెక్టును గాడినపెట్టాం. సులభంగా పూర్తవ్వాల్సిన ప్రాజెక్టును నాశనం చేశారు. 2019లో మేం మళ్లీ అధికారంలోకి వచ్చి ఉండుంటే 2020 ఆగస్టు నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేసేవాళ్లం. పోలవరం ఏపీకి జీవనాడి. ఇది పూర్తైతే 7.20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 23.50 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు 28.5 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించవచ్చు. 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, విశాఖపట్నంలోని ప్రజలు, పరిశ్రమలకు 23 టీఎంసీల నీటిని అందించవచ్చు. ఈ ఏడాది 4 వేల టీఎంసీల నీరు సముద్రంలో కలిసింది. ఈ నీళ్లలో కనీసం నాలుగైదు వందల టీఎంసీల నీళ్లు వినియోగించుకున్నా రాష్ట్రంలో కరువు అనేది లేకుండా చేయవచ్చన్నారు.

ఏపీ విభజన చట్టంలో పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేర్చారు. ఆ సమయంలో ముంపునకు గురయ్యే 7 మండలాలు తెలంగాణలో ఉన్నాయి. దీని వల్ల ప్రాజెక్టు ముందుకు సాగదని కేంద్రానికి తెలిపి, ఆ 7 మండలాలు ఏపీలో కలపాలని అడగడం వల్ల పార్లమెంట్ సమావేశాలకంటే ముందుగానే కేబినెట్‌లో ఆమోదించి ఆర్డినెన్స్ ఇచ్చారు. కేంద్ర ప్రాజెక్టులు పూర్తైన వాటి చరిత్ర చూస్తే ఆశాజనకంగా లేదని,



ప్రాజెక్టును పూర్తి చేయాలంటే రాష్ట్రమే శ్రద్ధ తీసుకుంటే బాగుంటుందని నీతి ఆయోగ్ చెప్పింది. ఎట్టి పరిస్థితుల్లో ప్రాజెక్టును పూర్తిచేయాలన్న సంకల్పంతో పనులు చేపట్టి 2019 నాటికి 73 శాతం పూర్తి చేశాం. ఒకేరోజున 32,215 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసి గిన్నీస్ రికార్డ్ సాధించాం. 414 రోజుల్లో 1,397 మీటర్ల డయాఫ్రం వాల్ నిర్మించాం. నేరుగా 28 సార్లు సందర్శించా, 82 సార్లు వర్చువల్‌గా సమీక్ష చేశాను.

డయాఫ్రం వాల్‌ను దెబ్బతీశారు. కాఫర్ డ్యాం సకాలంలో పూర్తి చేసి ఉంటే డయాఫ్రం వాల్ దెబ్బతినేది కాదు. మళ్లీ మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు పరిస్థితిని అధ్యయనం చేయడానికి విదేశీ నిపుణులు వచ్చి పరిశీలించారు. కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలని సూచించారు. మళ్లీ రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాల్సి వచ్చింది. అంతకు ముందు ఖర్చు పెట్టిన రూ.440 కోట్లు వృథా అయ్యాయి. డయాఫ్రం వాల్‌ను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం.

ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1ను 2026 ఫిబ్రవరి 26కు పూర్తి చేస్తాం. ఎడమ కాలువ 2026 జూన్‌కు పూర్తవుతుంది. ఈసీఆర్ఎఫ్ గ్యాప్-2 మాత్రం 2027 డిసెంబర్‌కు గడువు పెట్టారు. టెక్నికల్ సమస్యలు ఉంటే తప్ప 2027 ఏప్రిల్ లేదా జూన్‌కు పూర్తి చేయాలని ఆదేశించాను. ఫేజ్-1ఏ, ఫేజ్-2 1ఏ, 1బీ పూర్తికి భూ సేకరణ ఇంకా చేయాల్సి ఉంది. దాదాపు 26 పునరావాస కాలనీలు పూర్తయ్యాయి. మరో 49 పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటివరకు 14,329 మందిని పునరావాసాలకు తరలించాం, మరో 6,578 మందిని తరలించాల్సి ఉంది. ఇవన్నీ పూర్తి చేయాలంటే మరో రూ.500 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంది. రూ.972 కోట్లు ఖర్చు చేసి ఈ ఏడాది నవంబర్‌కు ఫేజ్-1ఏలో ఉండే అందరికీ పునరావాసం కల్పిస్తాం. జూలై 2026కు ఫేజ్-1బి కింద 6 మండలాల్లో 48 పునరావాసాలు పూర్తి చేస్తాం. ఫేజ్-1ఏ, ఫేజ్-2 1ఏ, 1బీకి కలిసి రూ.6,270 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ఫేజ్-1లో 41.15 మీటర్ల వరకు ప్రాజెక్టు నిర్మాణం ఉంటుంది. వాస్తవానికి ప్రాజెక్టు ఎత్తు 45.74 మీటర్లు. 2019కి ముందు ఈ ఫేజ్1, ఫేజ్2 ప్రస్తావన లేదు. ఇది కూడా గతపాలకుల తప్పే. కానీ మళ్లీ వెనక్కి వెళ్తే ప్రాజెక్టు ఉనికికే ప్రమాదం. అందుకే మొదట ఫేజ్1 పూర్తి చేసి తర్వాత ఫేజ్-2 మొదలుపెడతాం.

### పునరావాస ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు

భూసేకరణ, పునరావాసానికి కూడా అదనంగా ఖర్చు అవుతోంది. ఒక వ్యక్తి చేసిన తప్పులను రాష్ట్రం ఏ విధంగా భరించాల్సి వస్తుందనడానికి ఇదొక ఉదాహరణ. సాగునీరు వచ్చినప్పుడు రైతులు ఆనందంగా ఉంటారు.వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అదనంగా ఇంకా ఏమీ చేయగలుగుతామో ఆలోచించి, వారి జీవితాల్లో మరింత మార్పులు తీసుకురావాల్సి ఉంది. పునరావాస ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టే అంశాన్ని కూడా పరిశీలిస్తాం.

# ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను బెదిరించిన వ్యక్తికి బెయిల్

(మొదటి పేజి (తరువాయి)

ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసుల్లో బీఎన్ఎసఎస-35 (సీఆర్పీసీ 41ఏ) ప్రొసీజర్‌ను పరిశీలించకుండా యాంత్రికంగా నిందితుడిని రిమాండ్‌కు పం పిన కరీంనగర్ మొదటి అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌తోపాటు దర్యాప్తు అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. లండన్ నుంచి ఇంటర్నెట్ కాల్ చేసిన నిందితుడు అఖిలేషరెడ్డి రూ.20 లక్షలు ఇవ్వకపోతే.. చంపేస్తానంటూ బెదిరించాడంటూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత ఏడాది సెప్టెంబరు 29న కొత్తపల్లి(కరీంనగర్ జిల్లా) పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. లండన్‌లో ఉన్న నిందితుడిపై పోలీసులు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు.

# అక్రమ వలసదారుకలు ఇదేమీ ధర్మసత్రం కాదు

న్యూఢిల్లీ,మార్చి27 అక్రమంగా దేశంలోకి ప్రవేశించే వారికి చోటు లేదని, ఇదేమీ ధర్మసత్రం కాదని కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా కఠినంగా హెచ్చరించారు. విద్యా, వ్యాపార పరంగా భారత్‌లోకి విదేశీయులను ఆహ్వానిస్తామని అన్నారు. కానీ, దురుద్దేశంతో దేశంలోకి ప్రవేశించే వారి పట్ల కఠిన వైఖరితో ఉంటామని హెచ్చరించారు. దేశాభివృద్ధికి సహకరించే వారికి మేము ఎల్లప్పుడు సహకరిస్తాం. కానీ, దురాలోచనతో దేశంలోకి ప్రవేశించి.. హాని కలిగించాలనుకునే వారి పట్ల మోదీ సర్కారు కఠిన వైఖరి అవలంబిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని దేశంలో అడుగు పెట్టనివ్వం. అలాంటి వారికి మా దేశం ధర్మశాల కాదని గుర్తు పెట్టుకోవాలని అమిత్ షా హెచ్చరించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఇమ్మిగ్రేషన్ బిల్లును లోక్‌సభ గురువారం ఆమోదించింది. చొరబాటు, అక్రమ వలసలను ఆపడం లక్ష్యంగా తీసుకువచ్చిన ఈ బిల్లు పేరు ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారిన్ బిల్లు 2025. ఈ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. దేశాభివృద్ధి కోసం వస్తున్న వలసదారులను మేము స్వాగతిస్తామని హోంమంత్రి లోక్‌సభలో వెల్లడించారు. విద్య, వ్యాపారం, పరిశోధన కోసం దేశానికి వచ్చే వారిని మేము స్వాగతిస్తాము. 2047 నాటికి దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలనేది ప్రధాని మోడీ లక్ష్యం. అందుకే చాలా పాత చట్టాలను రద్దు చేశామన్నారు. వలస అనేది ఒక ప్రత్యేక సమస్య కాదు. దేశంలోని అనేక సమస్యలు దీనితో ముడిపడి ఉన్నాయి. జాతీయ భద్రత దృష్ట్యా, దేశ సరిహద్దులోకి ఎవరు ప్రవేశిస్తారో తెలుసుకోవడం చాలా ముఖ్యం. దేశ భద్రతకు హాని కలిగించే వారిపై తీవ్రంగా వ్యవహరిస్తామని అన్నారు. ఈ బిల్లు దేశ భద్రతను బలోపేతం చేస్తుందని, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు సహాయపడుతుందని కేంద్ర హోం మంత్రి అన్నారు.

# కడప గెలుపుతో సంబరాలు వద్దు

## రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం

## రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

కడప,మార్చి27 కడప జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కై-వసం చేసుకుంది.. దీనిపై స్పందించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.. హాట్ కామెంట్స్ చేశారు.. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి లాగా ఎన్నికలు జరగకుండా రౌడీయిజం, పోలీస్ ఇజంతో ప్రవర్తించలేదన్నారు. మా ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు అయింది.. మేం ఎక్కడ కూడా ఏ మున్సిపల్ చైర్మన్, జడ్పీ చైర్మన్, ఎంపీపీని దించేందుకు మా నాయకత్వం కానీ, మేము కానీ ముందుకు రాలేదన్నారు.. ఉమ్మడి కడప జిల్లాలో జడ్పీ చైర్మన్ దక్కించుకున్నామంటూ వైసీపీ వారు కేకులు కోసుకోవడం, దండలు వేసుకోవడం వంటివి చేస్తూ హడావిడి చేస్తున్నారు.. ఉమ్మడి కడప జిల్లాలోని 50 జడ్పీటీసీలు రాజీనామాలు చేసి ఈరోజు ఎన్నికలకు వస్తే ఎవరు గెలుస్తారో తెలుస్తుందంటూ.. వైసీపీ నేతలకు సవాల్ విసిరారు.. వైసీపీ వాళ్లు వాళ్ల కుర్చీల కోసం వాళ్లే కొట్లాడుకొని తెలుగుదేశంపై మేం యుద్ధం చేసి జడ్పీ చైర్మన్‌ను కైవసం చేసుకున్నామంటూ చెప్పుకోవడం విడ్డూరంగా ఉందంటూ ఎద్దేవా చేశారు. రాబోయే ఒకటిన్నర సంవత్సరంలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి... త్వరలో అన్ని స్థానాల్లో కూటమి ప్రభుత్వం పోటీ చేస్తుంది.. గెలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు.. కూటమి ప్రభుత్వంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎలా గెలిచారో ఆ విధంగా స్థానిక సంస్థలలో కూటమి అభ్యర్థులు కూడా అత్యధిక మెజార్టీతో గెలుస్తారనే నమ్మకాన్ని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెలిబుచ్చారు.

# పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన అప్పు 4.17లక్షల కోట్లే

హైదరాబాద్, మార్చి 27 : 'బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఏటా రూ.41 వేల కోట్ల చొప్పున చేసిన అప్పు అక్షరాల రూ.4.17లక్షల కోట్లే.. ఇది కాగ్ రిపోర్ట్‌తోపాటు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రసంగంలో తేటతెల్లమైంది. అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్‌ది గోబెల్స్ ప్రచారమని నిరూపితమైంది' అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ చేసిన అప్పులపై అబద్ధపు ప్రచారాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంలో, ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగట్టడంలో బీఆర్ఎస్ సఫలీకృతమైందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పత్రికల్లో హెడ్‌లైన్లు, బ్రేకింగ్‌ల కోసమే మాట్లాడి సమావేశాలను సిల్లీగా తీసుకున్నారని విమర్శించారు. 'కాంగ్రెస్ సర్కారు 15 నెలల్లో తెచ్చిన అప్పులు, ఖర్చులపై సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తలోమాట చెప్పారు. ఈ రోజు సీఎం 3:58 గంటలకు రూ.1.58 లక్షల కోట్లు అప్పులు చేసి అందులో రూ. 1.53 లక్షల కోట్లు అసలు, వడ్డీలు కట్టామని అన్నారు. కానీ, డిప్యూటీ సీఎం భట్టి రాత్రి 7:44 గంటలకు రూ.88 వేల కోట్లు అసలు, వడ్డీలకు చెల్లించామని చెప్పారు. ఇద్దరు కలిసి నాలుగు గంటల్లోనే రూ.70 వేల కోట్ల తేడా చూపారు' అని ఎద్దేవా చేశారు. గురువారం ఆయన అసెంబ్లీ మీడియాపాయింట్‌లో, అంతకుముందు అసెంబ్లీలో మాట్లాడారు. ఈ బడ్జెట్ సమావేశాల సాక్షిగా కాంగ్రెస్ సభా సంప్రదాయాలను, విలువలను మంటగలిపిందని ధ్వజమెత్తారు. 11 రోజులు సభ నడిపి రెండురోజులే ప్రశ్నోత్తరాలు నిర్వహించడం ఇందుకు నిదర్శనమని అన్నారు. చర్చలు జరిగిన తీరు చూస్తే కేవలం బడ్జెట్ ఆమోదానికే సభను నిర్వహించినట్లు అర్థమవుతున్నదని అన్నారు.

సూర్య
తెలుగు దిన పత్రిక
శుక్రవారం 28
మార్చి 2025

# చందూరులో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

### - కళ్లెం సురేందర్ రెడ్డి



చండూర్ మార్చి 27 (సూర్య టుడే):
చండూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారులు కళ్లెం సురేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం చండూరులో ఆయన మాట్లాడుతూ... చండూరు గ్రామీణ, పట్టణ ప్రాంతం మిళీతమై ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు, హెూటల్లు, బౌల అంతస్తుల భవనాలు ఉన్నాయి. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు దూర ప్రాంతాల నుంచి అగ్నిమాపక సిబ్బంది రావడం ఆలస్యం జరుగుతాయని, అప్పటికే విలువైన ఆస్తులు కాలి బూడిద అవుతాయి. కోట్లలో ఆస్తి నష్టం కోల్పోయే అవకాశం ఉంటుందని అన్నారు. చండూరులో అగ్నిమాపణ ఏర్పాటు చేస్తే, చండూరుతో పాటుగా మునుగోడు, నారాయణపురం, గట్టుప్పల్, మర్రిగూడెం, నాంపల్లి మండలాల ప్రజలకు మేలు చేకూరుతుంది. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సంఘటన స్థలాలకు త్వరితగతిన చేరుకుని ఆస్తి నష్టం తగ్గించే ప్రయత్నం చేయవచ్చు అని అన్నారు. ఆ దిశగా ప్రభుత్వం వెంటనే అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని అతను కోరారు.

# ఎన్నికల హామీ మేరకు అర్హులైన మహిళలందరికీ రూ. 2500/- ఇవ్వాలని - బిజెపి డిమాండ్



చండూర్ మార్చి 27 (సూర్య టుడే):
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలలో భాగంగా ఆసరా పెన్షన్లు 4000 రూపాయలు, మహాలక్ష్మి పథకం ద్వారా అర్హత కలిగిన మహిళలం దరికీ ప్రతినెలా 2500 రూపాయలు ఇవ్వాలని బిజెపి మున్సిపల్ అధ్యక్షులు పందుల సత్యం గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నోటికొచ్చిన హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం పదిహేను నెలల గడుస్తున్నా ఏ ఒక్క హామీ కూడా సంపూర్ణంగా అమలు చేయకపోవడం సిగ్గుచేటని తీవ్రంగా విమర్శించారు. మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు, 6వ వార్డు, 2వ వార్డు లలో అర్హత కలిగిన పెన్షన్ దారులు, మహిళల నుండి దరఖాస్తులను స్వీకరించారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అర్హులందరితో కలిసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట త్వరలో ధర్నా నిర్వహిస్తామని ప్రకటించారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారం చేపట్టి, మొండి చెయ్యి చూపెడుతున్న కాంగ్రెస్ పాలనపైన ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సోమ నరసింహ, జిల్లా కౌన్సిల్ సభ్యులు భూతరాజు శ్రీహరి, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నెపర్తి యాదగిరి, 214 బూత్ అధ్యక్షులు బోడ ఆంజనేయులు, మున్సిపల్ నాయకులు సోమ శంకర్, వేముల పవన్ కళ్యాణ్, తడకమళ్ళ శ్రీధర్, చిట్టిప్రోలు వెంకటేశం, భూతరాజు స్వామి, ఇరిగి ఆంజనేయులు, గండు శ్రీకాంత్, పున్నఅరుణోదయ, నరసింహ, రాము, సోమ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధి రంగాన్ని ఎంచుకోవాలి

### మాజీ సర్పంచ్ రాజు నాయక్



యాచారం సూర్య న్యూస్ ( మార్చి 27):. మండల పరిధి లో నంది వనపర్తి గ్రామనికి చెందిన పంది వంశీ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ను మాజీ సర్పంచ్ రాజు నాయక్ ప్రారం భించారు. గురువారం అనంతరం ఆయన మాట్లాడుతూ. యువకులు స్వయం ఉపాధితో వ్యాపారం చేసుకోవాలని సూచించారు. యువకులు ఉద్యోగాలపై ఆధారపడకుండా, ఇలాంటి సొంతంగా వ్యాపారాలు చేసుకుంటే గనక ఆర్థికంగా ఎదగడానికి ఎక్కువ అవకాశం ఉన్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంజమల్ల దాసు, నర్ర భాష, మూలి జంగయ్య, యంజాల వెంకటేష్, నెట్టి బీరప్ప, యంజాల చంద్రకాంత్, కొండపురం నాగరాజ్, కొండపురం శ్రీనివాస్, వర్ద్యవత్ గణేష్, ప్రశాంత్, బసవేశ్వర్, కొండాపురం సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# తైక్వాండో పోటీలలో గాంధీజీ విద్యార్థుల ప్రభంజనం

- తైక్వాండో విజేతలను అభినందించిన డాక్టర్ కోడి శ్రీనివాసులు
- ఆత్మరక్షణకు, శారీరక దృఢత్వానికి తైక్వాండో దోహదపడుతుంది
- తైక్వాండో విజేతలను అభినందించిన ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు



చండూర్ మార్చి 27 (సూర్య టుడే):
ఆత్మ రక్షణకు, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడానికి తైక్వాండో ఎంతగానో దోహదపడుతుందని ట్రస్మా జిల్లా అధ్యక్షులు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. ఈ నెల 23వ తేదీ ఆదివారం నాడు చండూరు మున్సిపాలిటీ కేంద్రంలోని మార్కెట్ యార్డ్ నందు నిర్వహించిన యునైటెడ్ నలగొండ జిల్లా తైక్వాండో ఛాంపియన్షిప్ -2025 పోటీల్లో చండూరు మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన గాంధీజీ విద్యాసంస్థలలోని విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి, పతకాలను సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థుల్లో రేయాన్, మధుశ్రీ స్వర్ణ పథకాలు, అనన్య, శ్రాగ్వి, ఆదిత్య, అరవింద్ లు రజత పతకములను, రేవంత్, ఆయేషా అంజూమ్, యశ్వంత్,వీరజ్ లు కాంస్య పథకాలను సాధించారు. వీరిని గురువారం నాడు గాంధీజీ విద్యాసంస్థల్లో ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు మెడల్స్ ను, సర్టిఫికెట్స్ ను అందించి అభినందించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులు జాతీయస్థాయి మరియు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పథకాలను సాధించి చండూరుకు, చదువుకున్న పాఠశాలకు, కన్న తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆశించారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఆత్మ రక్షణ కోసం తైక్వాండో నేర్చుకోవాలని అన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రంగాల్లో నైపుణ్యం పెంచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, వారిలో ఆత్మ సైరాన్ని పెంచడానికి వివిధ వేదికలపై జరిగే కార్యక్రమాలకు విద్యార్థులను పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్స్ సత్యనారాయణమూర్తి, పులిపాటి రాధిక, తైక్వాండో ట్రైనర్ నాగిల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రంగంపల్లిలో చలివేంద్రం ప్రారంభం..


### ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య



షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (మార్చి 27):ఫరూఖ్ నగర్ మండలం రంగంపల్లి గేట్ వద్ద వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రయాణికులకు శీతల నీటి అందుబాటును కల్పించేందుకు బీజేపీ ఫరూఖ్ నగర్ మండల అధ్యక్షులు పిట్టల సురేష్ చలివేంద్రా న్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అందె బాబయ్య మాట్లాడుతూ, వేసవి కాలంలో దాహార్తిని తీర్చే విధంగా ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం గొప్ప సామాజిక సేవా కార్యక్రమమని, ఇటువంటి ప్రజాహిత కార్యక్రమాలను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే, ప్రజాసేవలో బీజేపీ ఎప్పుడూ ముందు ఉంటుందని, సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పార్టీ నిరంతరంగా కృషి చేస్తుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ గుప్త, ప్యాట అశోక్, వంశీ కృష్ణ, ఎంకనోళ్ల వెంకటేష్, ప్రశాంత్ ముదిరాజ్, శ్రీనివాస్ చారి, శివకృష్ణ తదితరులు పాల్గొని తమ మద్దతును తెలిపారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన పిట్టల సురేష్ ని అందె బాబయ్య ప్రత్యేకంగా అభినందించి, సేవా దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిట్టల పాపయ్య, జవాజి లక్ష్మయ్య, సారం అంజయ్య గౌడ్, బద్దుల శ్రీకాంత్, చౌలపల్లి రవీందర్ గౌడ్, దుర్గం రాఘవేందర్, గడ్డాల రమేష్, గుంటి శ్రీకాంత్, పిట్టల శివకుమార్, రంగంపల్లి బూత్ అధ్యక్షుడు జవాజి శివకుమార్, జవాజి వేణు, జె సురేష్, గుంటి సత్తయ్య, గడ్డల కృష్ణ, గుంటి లక్ష్మయ్య, చెక్కల బిక్షపతి, పిల్లి బాబు పోగుల, నర్సింలు, జెట్టి గారి ప్రశాంత్, అజయ్ కుమార్, జవాజి పాండయ్య, పురుగుల పవన్ కళ్యాణ్, పల్లెల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలి

### ఎస్సీ సెల్ చండూరు మున్సిపల్ అధ్యక్షులు - ఇర్గి శంకర్



చండూర్ మార్చి 27 (సూర్య టుడే):మంత్రి వర్గ విస్తరణలో భాగంగా మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలి కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ మొదటి నుండి కూడా మాదిగలు కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉన్నారు. మాదిగలు రాజకీ యంగా ఆర్థికంగా సామాజి కంగా వెనుకబడి ఉన్నారు కానీ ఎస్సీ లలో ఉపకులాలకు మాత్రమే మంత్రి పదవులు ఇచ్చారు ఎస్సీ లలో జనాభా లెక్కల ప్రకారం మాదిగలు ఏక్కువగా ఉన్నారు. కానీ అసలైన మాదిగలకు మాత్రం మంత్రి పదవులు లేవు ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నది కూడా ఎవరు ఎంతో వారికి అంత కాబట్టి ఈ సారి మంత్రి వర్గ విస్తరణలో భాగంగా అధిష్టానం ఆలోచన చేసి కచ్చితంగా మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలి అని కాంగ్రెస్ పార్టీ అధిష్టానాని కోరుతున్నాము.

# రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన సన్ షైన్ విద్యార్థులు



చండూర్ మార్చి 27 (సూర్య టుడే):
నల్గొండ జిల్లా చండూర్ మున్సిపాలిటీ కేంద్రంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి యునైటెడ్ నల్గొండ డిస్ట్రిక్ట్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలలో స్థానిక సన్ షైన్ పాఠశాలకు చెందిన విద్యార్థి దాచెపల్లి వెంకట్ సాయి అత్యుత్తమ ప్రదర్శన కనబరచి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పథకం గెలుపొందాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న వారిని అభినందిస్తూ సన్షైన్ విద్యార్థులు చదువులతో పాటు ఆటలలో కూడా అగ్రస్థానంలో రాణిస్తారు అనడానికి గతంలో జరిగిన తైక్వాండో పోటీలలో మూడు సార్లు బంగారు పథకం రెండు సార్లు కాంస్య పథకం సాధించిన వెంకట్ సాయి పట్టుదలే నిదర్శనమని అన్నారు. అదేవిధంగా తైక్వాండో ఆత్మరక్షణలో భాగం మాత్రమే కాదంటూ మానసిక ఉత్తేజాన్ని కలిగిస్తూ భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణించడానికి సహాయపడుతుందని అన్నారు. ఈ కరాటే పోటీలో తెలంగాణ రాష్ట్రం నుండి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నప్పటికీ క్రమశిక్షణ, చురుకుతనం మరియు క్రీడా స్ఫూర్తిని ఉన్నత స్థాయిలో ప్రదర్శించిన సన్ షైన్ విద్యార్థులను బహుమతులు వరించాయని, అదేవిధంగా ప్రతి ఒక్కరు క్రమశిక్షణ కలిగి ఉండడం ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కోడి సుష్మ, ప్రిన్సిపల్ రవికాంత్, ప్రవీణ్, లతీఫ్ పాషా మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అయోడిన్ ఆవశ్యకత పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

### ఇనిస్టూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ అధికారి సురేష్ బాబు



చండూర్ మార్చి 27 (సూర్య టుడే):
గురువారం రోజు చండూరు మండలం పుల్లెంల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆశీర్వాద స్మార్ట్ ఇండియా ప్రోగ్రాం లో భాగంగా పోషణ్ మేళ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ అధికారి సురేష్ బాబు మాట్లాడుతూ అయోడిన్ ఆవశ్యకత పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అయోడిన్, పోషకాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం కారణంగా వివిధ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నాడు. అనంతరం వివిధ ఆరోగ్య స్టాల్స్ ను ఏర్పాటు చేసి సామాజిక వయోజన మహిళలకు మరియు కౌమార బాలబాలికలకు అయోడిన్ యొక్క ఉపయోగాలను, బలవర్ధకమైన ఆహారపు అలవాట్లను గురించి వివిధ ఆటల పోటీలు నిర్వహించి విద్యార్థులకు ,ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ఆటల్లో విద్యార్థులకు గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుల, ఇతర ఉపాధ్యాయుల బృందం అలాగే ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ సిబ్బంది అనురాధ, మనోహర్, వెంకన్న సురేష్, ఏఎన్ఎం, అంగనవాడి టీచర్స్, ఆశా వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

# స్నేహమేరా జీవితం-స్నేహంలో ఎంతో ఆనందం -ఆప్యాయత..

### ఆక్సిడెంట్ లో గాయపడిన స్నేహితుడికి ఆర్థిక సాయం



షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (మార్చి 27): కేశంపేట్ మండల పరిధిలోనికొత్తపేట గ్రామానికి చెందిన కొండి రమేష్ ఎలక్ట్రిషన్ వృత్తి జీవనాధారం నెల రోజుల క్రితం ప్రమాదంలో రమేష్ కాలు విరిగిపోవడం వల్ల అతను పనికి వెళ్లలేక పోతున్నాడు ఈ విషయం అర్థం చేసుకున్న గ్రామానికి చెందిన బీజేవైఎం కేశంపేట మండల అధ్యక్షులు పాలాది శ్రీనివాస్, కొండి రమేష్ ని కలిసి పరామర్శించి ధైర్యం చెప్పి 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు అలాగే రమేష్ నీ గాయం పూర్తిగా మానేవరకు జాగ్రత్తగా ఉండమని సూచించారు. అవసరమైతే స్నేహితులం మళ్ళీ సహాయం కూడా చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తట్టేపల్లి నరసింహ, లేకపోతుల విట్టల్, పుట్నాల శ్రీను, దానగళ్ళ మహేష్,పులి శ్రీకాంత్, పేరుమల్ల సతీష్, పేరుమల చెన్నకేశవులు, బాలు, రాహుల్, పాండు, సిద్ధార్థ్, సందీప్, బాలు, తదితరులు పాల్గొని స్నేహమేరా జీవితం-స్నేహంతో ఎంతో ఆనందం ఎంతో ఆప్యాయత ఉంటుందని అన్నారు.

# ఇండియా వరల్డ్ కప్ టోర్నమెంట్ కి వినయ్ ఎంపిక

## కష్టపడితే ఏదైనా సాధ్యం



యాచారం సూర్య న్యూస్ ( మార్చి 27):. మండల పరిధిలో తక్కల్లపల్లి గ్రామానికి చెందిన మద్దెల వినయ్ మహారాష్ట్ర లోని నాగపూర్ జిల్లాల్లో మార్చి 22 నుండి 26 వరకు క్రీడలు నిర్వహించారు. జాతీయస్థాయి 19వ సీనియర్ , 13వ సబ్ జూనియర్ ఫుట్బాల్ ఛాంపియన్స్ లో 15 సబ్ జూనియర్ బాలురు విభాగంలో టీం ఈవెంట్లో సెమీఫైనల్ లో తెలంగాణ రాష్ట్రం, మధ్యప్రదేశ్ జట్టుతో హెూరా..హెూరీగా తలపడి మూడవ స్థానంలో రజాత పథకాన్ని కైవాసం చేసుకున్నాడు. బంగారు రజత పథకాలను సాధించిన క్రీడాకారులకు తెలంగాణ రాష్ట్రం ఉడ్డుబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఆదర్శ ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల ఎండి రహమత్ క్రీడాకారులకు అభినందించారు. మారుమూల గ్రామానికి చెందిన వినయ్ ఇండియా వరల్డ్ కప్ టోర్నమెంట్ కు ఎంపిక కావడం యాచారం మండల ప్రజలు, అధికారులు, ప్రతి ఒక్కరూ హర్ష వ్యక్తం చేశారు. ఏదైనా విజయం సాధించాలంటే కులము మతము, పేద ధనిక వర్గాలు అడ్డులేదని మద్దెల వినయ్ ప్రతిభ కనపరిచారు. ఈ విద్యార్థిని చూసి ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు నేతలు ఆశీర్వదించారు. ఇండియా టోర్నమెంటులో విజయం సాధించాలని ప్రజలు, నేతలందరూ ఆశీర్వదించారు.

# చర్ల పటేల్ గూడ లో సినిమా సందడి



ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మార్చి 27
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని చర్ల పటేల్ గూడ గ్రామంలో ద ప్రీ వెడ్డింగ్ షో సినిమా షూటింగ్ జరుగుతుంది. ఈ సినిమాలో హీరో తిరువీర్ హీరోయిన్ గా టీనా శ్రావ్య. మాస్టర్ రోహన్ మరియు డైరెక్టర్ రాహుల్ శ్రీనివాస్. ప్రొడ్యూసర్స్ సందీప్ ఆగారం, బాసాని అస్మితా రెడ్డి ఆధ్వర్యంలో ఈ సినిమా షూటింగ్ జరుగుతుంది . ఈ సినిమా షూటింగ్ ను గ్రామ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ప్రొడ్యూసర్ బాసాని అస్మిత రెడ్డి మాట్లాడుతూ మా గ్రామంలో షూటింగ్ తీయడం నాకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సినిమా షూటింగ్ కార్యక్రమంలో ప్రొడ్యూసర్స్ బాసాని అస్మితా రెడ్డి ఫ్యామిలీ మెంబర్స్ అందరూ గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏప్రిల్ 2 న అయ్యప్ప స్వామి ఇరుముడి చివరి తేదీ



నందిగామ సూర్య టుడే మార్చ్ 27
నందిగామ అయ్యప్పస్వామి దేవాలయంలో శ్రీ అయ్యప్పస్వామి విగ్రహం ఈ నెల 26 న శబరిమల ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ కంటారు రాజీవర్ తంత్రి ఆయన కుమారుడు శ్రీ బ్రహ్మ దత్తన్ ల చేతులమీద శ్రీశ్రీ గిరీషన్ సతీషన్ నాయర్ గురుస్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ట ఉత్సవాలు ఊహించని విధంగా కన్నులపండువగా కొనసాగిన విషయం మనకు విధితమే.శ్రీశ్రీశ్రీ గురుబ్రహ్మ సతీషన్ నాయర్ గురుస్వామి ఆశీర్వాదం తో ఉత్సవాలు జరిగాయి.ఈ నేపథ్యంలో ఈ నేల 30 న తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నందిగామ అయ్యప్పస్వామి దేవాలయంలో సాయంత్రం 7 గంలకు శ్రీ గిరీషన్ సతీషన్ నాయర్ గురుస్వామి నేతృత్వంలో పడి పూజ జరుగుతుంది.పడి పూజకు అయ్యప్పస్వాములు,భక్తులు హాజరై శ్రీ అయ్యప్పస్వామి కృపకు పాత్రులు కాగలరనికోరారు . ఈ సందర్భంగా శబరిమల వెళ్ళే అయ్యప్పస్వామి భక్తులకు శ్రీ గిరీషన్ సతీషన్ నాయర్ గురుస్వామి తెలియపరిచిన విషయం శబరిమల వెళ్లే అయ్యప్పస్వాములకు ఏప్రిల్ 2 న ఇరుముడి చివరి రోజు అని తప్పక గుర్తుంచుకోవాలని తెలిపారు.

# గ్రామాలలో ప్రభుత్వ గ్రామ కంఠ భూములను కాపాడాలి

- అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలను అందించాలి
- ప్రజ సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పోరుబాట
- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలి
- సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ



చండూర్ మార్చి 27 (సూర్య టుడే):
చండూరు మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో ప్రభుత్వ గ్రామ కంఠ భూములు కబ్జాకు గురవుతున్నాయని ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో సర్వే చేసి ఆ భూములను కాపాడాలని సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద మండలంలో సిపిఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సర్వే దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ దశరథకు వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందజేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి కోరారు. మండలంలోని అన్ని గ్రామాలలో అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు , వృద్ధాప్య పింఛన్ , ఇందిరమ్మ ఇల్లు , ఇండ్ల స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక లబ్ధిదారునికి అందించాలని కోరారు. గ్రామాలలో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం లేక గ్రామాలలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గతంలో పల్లె వెలుగు బస్సులు నడిపి నిలిపివేసిన ప్రతి గ్రామానికి బస్సులను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

మండలంలోని అన్ని గ్రామాలకు మరో మండలానికి లింకు రోడ్ల నిర్మాణం , నూతనంగా బీటు రోడ్ల నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి ఎంతోమంది రైతులకు రైతు భరోసా రాకపోవడంతో ప్రైవేట్ వడ్డ వ్యాపారల వద్ద అప్పుచేసి రైతులు పంట సాగు చేసుకుంటున్నారని తెలిపారు . పెండింగ్లో ఉన్న రైతు భరోసా , రెండు లక్షల రుణమాఫీ వెంటనే రైతు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని అధికారులు , ప్రజాప్రతినిధులు గ్రామాలలో మంచినీటి ఎదడి తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు . ప్రభుత్వ గ్రామకంఠ భూములను మండలంలోని ఏ గ్రామంలో అయినా ఎవరైనా కబ్జా చేస్తే ఊరుకోబమని ఆయన అన్నారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు చిట్టిమల్ల లింగయ్య, వెంకటేశం, ఈరటి వెంకటయ్య, స్వామి, బల్లెం వెంకన్న, రాజు, బుర్కల రామలింగం, బుర్కల నాగేష్, బొమ్మరగోని యాదయ్య, తదితరులు ఉన్నారు.

# స్వయం ఉపాధి పేరుతో పేద ప్రజలతో ఆటలాడుతున్నరా...?

- ఎమ్మార్వో ఆఫీసులలో సర్వర్ డౌన్ ...?
- నిరుపేద యువకులకు కులం ఆదాయం సర్టిఫికెట్ ఎలా వస్తుంది..?
- బుద్దుల జంగయ్య డిమాండ్ !

షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (మార్చి 27) : ఎమ్మార్వో కార్యాలయంలో సర్వర్ డౌన్ మరియు టెక్నికల్ ప్రాబ్లం ఉంటే పేదలైన యువకులకు కులము ఆదాయం ధ్రువ పత్రాలు రానందున ఇబ్బందులు పడుతున్నారని బుద్ధుల జంగయ్య అన్నారు. వారు మాట్లాడుతూ...
రాజీవ్ యువ వికాసం పేరుతో 75 రకాల స్వయం ఉపాధికి సంబంధించిన యూనిట్లకుఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుంది అని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బి కే ఎన్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య నేడు ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 వేల నుంచి 4 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తాం ఆన్లైన్ దరఖాస్తులు పెట్టుకోండి అని ప్రభుత్వం ప్రకటన చేసింది ఆశావాహులైన పేదలు యువకులు మహిళలు పెద్ద ఎత్తున కులం ఆదాయం సర్టిఫికెట్ కోసం మీ సేవల దగ్గర పడిగాపులు కాసి అప్లికేషన్లు పెట్టుకొని అవి తీసుకొని పోయి ఎమ్మార్వో ఆఫీస్ లో ఇస్తే ఎమ్మార్ ఆఫీసు లో సర్వర్ డవ్ న్ మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఎలా అప్లికేషన్లు పెట్టుకుంటారు ఎలా ఉపాధి పొందుతారు ప్రభుత్వం - అధికారులు సమాధానం చెప్పాలని ఆయన మండిపడ్డారు దరఖాస్తులకు చివరి తేదీ ఏప్రిల్ 5 అని ప్రకటన చేసింది ప్రభుత్వం సర్వర్ డౌన్ తో మూడు రోజులు గడిచిపోయాయి వరుసగా మరో మూడు రోజులు పండగల పేరుతో సెలవులు వస్తున్నాయి పేదలు ఎలా దరఖాస్తులు చేసుకుంటారని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. సర్వర్ డౌను (టెక్నికల్ ప్రాబ్లం) కావడం అంటే అది ప్రభుత్వమే ఈ రకంగా వ్యవహరిస్తుందని అనిపిస్తుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.
మీ సేవలధార వేలాది లక్షలాది అప్లికేషన్ ఇప్పటికే పెట్టుకున్నారు. దాని ద్వారా ప్రభుత్వానికి మాత్రం పెద్ద ఎత్తున ఆదాయం వస్తుంది కానీ ఆశాభాహులైన యువత మహిళలు పేదలు కులం సర్టిఫికెట్ ఆదాయం సర్టిఫికెట్ చేతికి రాకపోవడంతో ఆన్లైన్ దరఖాస్తు పెట్టుకోలేని స్థితిలో అయోమయంలో ఉన్నారు. ఇకనైనా



ప్రభుత్వం ఆన్లైన్ క్లియరెన్స్ చేసి అప్లికేషన్లు పెట్టుకున్న ప్రజలకు సహకరించాలని ఆయన కోరారు అలాగే దరఖాస్తులు పెట్టుకోవడానికి తేదీని కూడా పొడిగించాలని డిమాండ్ చేశారు
లేని ఎడల ఎమ్మార్వో ఆఫీసుల ముందు ధర్నాలు చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

# నాంపల్లి మోడల్ స్కూల్ లో విభిన్న పాఠశాలల భాగస్వామ్య కార్యక్రమం

చండూరు మార్చి 27 (సూర్య టుడే):
పిఎమ్ ఎస్ హెచ్ ఆర్ ఐ ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ కార్యక్రమాన్ని మోడల్ స్కూల్ పెద్దాపురంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్ పి హెచ్ ఎస్ నాంపల్లి, జెడ్ పి హెచ్ ఎస్ పస్నూర్, పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది. విద్యార్థులు మోడల్ స్కూల్ కి విచ్చేసి సైన్స్ ల్యాబ్ ఒకేషినల్ ల్యాబ్ ను సందర్శించి ఆనందాన్ని వ్యక్తం చేసారు విద్యార్థులకి డప్పు దరువులతో స్వాగతం పలుకగా చాలా సంతోషాన్ని వ్యక్త పరిచారు,అదే విధంగా పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదవాలని మంచి క్రమశిక్షణతో వుండాలని క్రమశిక్షణనే విజయానికి తొలి మెట్టనీ చెప్పారు. అనంతరం కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుండి వచ్చిన ఉపాధ్యాయులు



మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య అందుతున్నది దాన్ని విద్యార్థులు చక్కగా ఉపయోగించుకోవాలని ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యా బోధన జరుగుతుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు అనేక పథకాల ద్వారా ఎంతో తోడ్పాటును అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు



మాట్లాడుతూ పాటలు పాడుతూ, డాన్సులు చేస్తూ వారి సంతోషాన్ని తెలియజేయడం జరిగింది. ఈ కార్య క్రమం లో పెద్దాపురం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు వివిధ పాఠశాలల నుండి వచ్చిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
శుక్రవారం 28 మార్చి 2025

# వారంరోజులే గడువు

- మరో పోరాటానికి సిద్ధం
- సీపీఐఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య
- అక్రమ అరెస్టు హేయమైన చర్య. పోలీసులు, రెవెన్యూ అధికారులు
- అండదండలతోటే రామోజీరావు భూ అక్రమాలు




ఇబ్రహీంపట్నం,సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మార్చి 27రామోజీ యాజమాన్యం ఆధీనంలో ఉన్న పేదల ఇండ్ల స్థలాలను విడిపించి పేదలకు పంపిణీ చేయకపోతే మరో పోరాటానికి సిద్ధమవుతామని సీపీఐఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్ హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇబ్రహీంపట్నం మండలం నాగన్ పల్లి సర్వేనెంబర్ 189/1, 203లో 2007 సంవత్సరంలో ప్రభుత్వం ఇంటి స్థలాల సర్టిఫికెట్లు ఇచ్చిన పేదలందరూ కలిసి తమ స్థలాల్లోకి వెళ్తే పోలీసులు అక్రమ అరెస్టు చేశారని మండిపడ్డారు. ప్రతి ఒక్కరికి 60 గజాల చొప్పున ఇంటి స్థలం పట్టాలు ఇచ్చి నక్ష ప్రకారం పొజిషన్ కూడా చూపించారన్నారు. ఈ ఇండ్ల స్థలాలను రామోజీ యాజమాన్యం అక్రమించి లబ్ధిదారులను ఆ స్థలాల్లోకి రాకుండా ఇబ్బందులు పెడుతుందన్నారు. ఇంటి స్థలాలకు వెళ్లే దారిలో కందకాలు తీశారన్నారు. ప్రభుత్వ నక్ష రోడ్డును కూడా రామోజీ యాజమాన్యం ప్రజలను రానివ్వకుండా అడ్డుగోడ నిర్మించుకుందన్నారు. లబ్ధిదారులు తమ ఇండ్ల స్థలాల్లోకి వెళుతున్న క్రమంలో రెవెన్యూ పోలీసు యంత్రాంగం కుమ్మక్కై పేదలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. తమ న్యాయమైన డిమాండ్ ని పరిష్కరించకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. మహిళలని కూడా చూడకుండా పోలీసులు విచక్షణ రహితం గా ప్రవర్తించారన్నారు. ఇండ్ల స్థలాల పోరాట కమిటీ కన్వీనర్ జగన్ కు గాయాలయ్యాయని, మరో మహిళ ఎల్లమ్మ సొమ్మసిల్లి పడిపోయిందని గుర్తు చేశారు.

రామోజీ ఆధీనంలో ఉన్న ఇండ్ల స్థలాలను విడిపించి పేదలకు అప్పజెప్పకపోతే వారం రోజుల్లో మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ పోరాటంతో ఇంతటితో ఆగకుండా రామోజీ ఆధీనంలో ఉన్న మరో 370 ఎకరాలను కూడా 10వేల మందిని సమీకరించి ఆక్రమిస్తామని హెచ్చరించారు. ఒక 18 సంవత్సరాల నుండి పోరాటం చేస్తున్న పేదలపై కేసులు నమోదు చేయడమే తప్ప సమస్యను పరిష్కరించడం లేదని విమర్శించారు. మరోవైపు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫార్మా రైతులకు తిరిగి భూములపై చెప్తామని చెప్పి మోసం చేసిందన్నారు. మళ్లీ ఫ్యూచర్ సిటీ పేరుతో 2500 ఎకరాల భూములను పేదల నుంచి సేకరించేందుకు పూనుకుంటుందన్నారు. ఈ క్రమంలో సీపీఐఎం ఆధ్వర్యంలో చేపట్టిన యాత్ర ముగింపు సందర్భంగా పోలీసులు ముందుగా అనుమతి ఇచ్చి చివరకు నిరాకరించాలన్నారు. ఫార్మా భూముల్లోకి సీపీఐఎం నేతలు, రైతులు వెళ్లకుండా హౌస్ అరెస్టులు చేశారని గుర్తు చేశారు. ఇది సరైంది కాదని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సిహెచ్, బుగ్గ రాములు, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ జంగయ్య, ఇళ్లస్థలాల పోరాట కమిటీ కన్వీనర్ జగన్, మండల కమిటీ సభ్యులు ఆనందం, నర్సింహ్మ, ఏ నర్సింహ్మ , నాయకులు యాదయ్య, బాలరాజు, శ్రీను, చరణ్, యాదగిరి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యదర్శి ఎల్లేష్ తదితరులు ఉన్నారు.

## ముస్లిం ఉపాధ్యాయులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన - ప్రధానోపాధ్యాయులు



చండూరు మార్చి 27 (సూర్య టుడే):
చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ముస్లిం ఉపాధ్యాయులకు సోదర భావంతో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయులు ఎడ్ల బిక్షం. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారావు, పి యాదయ్య, బి సైదులు, ఎస్.కె మజీద్, లతీఫ్, ఫిర్దోస్, సునీత జ్యోతి, ఎలిజబెత్, ఏ రాజు, పి యాదగిరి, సి అర్ పి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఎల్లవేళల ముందు ఉంటా

### కౌన్సిలర్ హేమాదేవేందర్ ముదిరాజ్



కొత్తూరు, సూర్య టుడే (మార్చ్ 27)ప్రజా సంక్షేమమే ధ్యేయం భవాని నగర్ కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించిన కౌన్సిలర్ వీరమోని హేమాదేవేందర్ ముదిరాజ్. కాలనీ అభివృద్ధి ధ్యేయంగా మున్సిపల్ నిధులకు తోడుగా తన సొంత నిధులతో అభివృద్ధికి మరో ముందడుగు వేసిన కౌన్సిలర్ హేమా దేవేందర్. గురువారం కొత్తూరు పురపాలికలోని ఆరవ వార్డు భవని నగర్ కాలనీలో రెండు విద్యుత్ లైన్లు ఒకదానిపై నుండి మరొకటి వెళ్లడంతో పెద్దగా గాలి వచ్చినప్పుడు ఒకదానికి ఒకటి తగిలి షార్ట్ సర్క్యూట్తో వీధిలైట్లు కాలనీలోని టీవీలు ఫ్రిజ్లు కాలిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇట్టి సమాచారం కౌన్సిలర్ హేమ దేవేందర్ ముదిరాజ్ కి తెలియడంతో వెంటనే స్పందించి తన సొంత నిధులతో రెండు విద్యుత్ స్తంభాల లైన్లను ఒకదానికి ఒకటి తగలకుండా ఇనుపరాడ్ల సహాయంతో విద్యుత్ అధికారులతో లైన్లను వేరుచేసి షార్ట్ సర్క్యూట్ జరగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా మున్సిపల్ అధికారులతో సంప్రదించి వీధి లైట్లు తెప్పించి దానికి సంబంధించిన సామాగ్రి తన సొంత నిధులతో తెప్పించి విద్యుత్ సమస్యను పరిష్కరించారు. కాలనీకి సంబంధించి సమస్యలను అధికారుల సహాయంతో పాటు తన సొంత నిధులతో అభివృద్ధి పనులను చేపడుతున్న కౌన్సిలర్ హేమ దేవేందర్ ముదిరాజ్ కి కాలనీవాసులు శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్ వెంకటేష్ మున్సిపల్ ఎలక్ట్రీషన్లు ఎం రాజు మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ ను పరామర్శించిన - కురపాటి గణేష్



చండూర్ మార్చి 27 (సూర్య టుడే):
చండూర్ మండలం పరిధిలోని బోడంగిపర్తి గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ ని పరామర్శించిన నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం అంబేద్కర్ యువజన సంఘం చండూర్ డివిజన్ అధ్యక్షులు కురుపాటి గణేష్, బైరు శేఖర్, అశోక్, భాను, తదితరులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడం జరిగింది.

## ఉగాదికి పేదలకు సన్న బియ్యం లాంచనంగా ప్రారంభించనున్న సీఎం

**కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి.**



ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మార్చి 27పేదలకు రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం అయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉగాదిపండుగ రోజు ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు ఏప్రిల్ 1వ తేదీ నుంచి తెలంగాణ వ్యాప్తంగా అన్ని రేషన్ షాప్ లో దొడ్డు బియ్యానికి బదులుగా సన్న బియ్యం ఇచ్చేందుకు పౌర సరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తుంది. రేషన్ కార్డుల్లో లబ్ధిదారుల సంఖ్యను బట్టి ఒక్కొక్కరికి ఆరు కిలోల సన్న బియ్యం ఇవ్వనున్నారు. దీనిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని మంకాల శేఖర్ రెడ్డి కోరారు.

## శ్యామ్ రావు తండాలో వనభోజనాలు







షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (మార్చి 27) : కేశంపేట్ మండల పరిధిలోని నిడుదవెల్లి గ్రామ అనుబంధ మైన శ్యామ్ రావు తండా వాసులు మహిళలు యువకులు పెద్ద ఎత్తున గురువారం వనభోజనాల కార్యక్రమం ఆటపాటలతోబంధువులు, స్నేహితులతో కలిసి ప్రకృతిలో ఆహ్లాదకరంగా భోజనం చేయడం, ఆటలు, పాటలు, వినోద కార్యక్రమాలు నిర్వహించారు.వనభోజనాలు ప్రకృతితో మన బంధాన్ని గుర్తుచేసుకునే ఒక మార్గం. కార్తీక మాసంలో ఉసిరి చెట్టు కింద వనభోజనాలు చేయడం ఒక ఆనవాయితీగా ఉంది. ఈ వేడుకతో సామాజిక సామరస్యం, పేరుతో మార్చి చివరి వారంలో బంధువులు స్నేహితులతో కలసి ఇదే విధమైన వేడుక చేసుకుంటారు. వన భోజనాలు ఆటపాటల కోసం, వినోదం కోసం, పిక్నిక్ లాంటి కాలక్షేపం కోసమే కాకుండా పిల్లలకు విజ్ఞాన యాత్రలా, పెద్దలకు ఆధ్యాత్మిక యాత్రలా కూడా ఉంటాయి, అని పాతులావత్ చందు నాయక్, మూడవత్ శ్రీను,పాతులావత్ రవి, పాతలావత్ లలిత, పాతలావత్ కవిత, స్వప్న, దేవులీ, నేజి, చాంది, తదితరులు, పాల్గొన్నారు.

## ఆదర్శ వృద్ధాశ్రమానికి వాటర్ ట్యాంక్, ఇనుప గేటు బహూకరణ

- ఆశ్రమానికి దాతల సహకారం మరువలేనిది.
- ఆశ్రమ నిర్వాహకులు ఎస్ఎస్ చారి, భాగ్యలక్ష్మి.





చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మార్చి 27
సుఖినోభవంతు ఫౌండేషన్, చైర్ పర్సన్ రత్నప్రభ ఆధ్వర్యంలో ఆదర్శ వృద్ధాశ్రమానికి వృద్ధుల సౌకర్యార్థం వాటర్ ట్రంక్, 1000 లీటర్స్,పైపులైను ఫిట్ చేయించి ఆశ్రమ ప్రహరీ ఆవరణకు మెయిన్ గేటు చేయిం చి ఇచ్చారు. సుఖినో భరంతు ట్రస్ మెంబర్లు రత్నప్రభ, విజయరెడ్డి, మాధవి, లత ఆధ్వర్యం లో 15, వేల రూపాయల చెక్కు ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ ఎస్ ఎస్ చారి, వృద్ధాశ్రమ ప్రెసిడెంటు బాగ్యలక్షి , ఆశ్రమ సిబ్బంది కృష్ణమ్మ, లక్ష్మమ్మ,జంగయ్య, వృద్ధులు సంతోషం వ్యక్తం చేసి ఫౌండేషన్ దాతలకు ధన్యవాదాలు తెలిపారు

## సంపాదకీయం

# వ్యవసాయ సంక్షోభ సవాళ్లు

వ్యవసాయాభివృద్ధికి ఎంతచేసినా తక్కువే. ధాన్యం పండిస్తున్న రైతన్నలను కాపాడుకుంటేనే మనకు నోట్లోకి ముద్దపోతుంది. కార్పోరేట్ కంపెనీలను మించి వారికి రాయితీలు ఇవ్వడం కూడా మంచిదే. వ్యవసాయికంగా దేశాన్ని బలోపేతం చేస్తే..అనుబంధరంగాలను ప్రోత్సహిస్తే దేశంలో ఆకలిచావులు ఉండవు. ధాన్యానికి కొదవ ఉండదు. పండిన పంటలను తక్కువ ధరలకు ప్రజలకు అందించేలా కూడా కార్యాచరణ ఉండాలి. ఈ విషయంలో కేంద్ర రాష్ట్రాలు కలిసి వ్యవసాయాభివృద్ధికి, రైతుల సంక్షేమానికి బృహత్ ప్రణాళిక రచించాలి. వ్యవసాయానికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. సబ్సిడీలు అందిస్తున్నారు. ధాన్యం సజావుగానే కొంటున్నామని అంటున్నారు. పాలకులు, ప్రతిపక్ష నేతలు రైతుజపం చేస్తున్నా వారి జీవితాలు మాత్రం బాగుపడడం లేదు. నిరతంర ఉచిత విద్యుత్ ఇస్తున్న తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా ఇస్తామని అప్పట్లో కెసిఆర్ ప్రకటించారు. అయితే ఇదొక్కటే సరిపోదు. నదుల అనుసంధానం ద్వారా ముందుగా నిరంతరంగా నీటి సరఫరా జరగాలి. ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలి. పండించిన పంటలను సక్రమంగా కొనుగోలు చేయాలి. పంటలు కొనుగోల చేయకుండా ఉచిత విద్యుత్,నీటితీరువా రద్దు, రైతుభరోసా వంటి కార్యక్రమాలు అమలు చేసినా లాభం లేదు. ఇకపోతే ఉచిత విద్యుత్ ఇస్తున్న కారణంగా...సరఫరాకు తగ్గట్లుగా ఉత్పత్తి కూడా ముఖ్యమే. దేశంలో సరిపడా విద్యుత్ ఉందా లేదా అన్న ఆలోచన చేయాలి. ఉత్పత్తి అవకాశాలు పెంచుకోవాలి. సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే విద్యుత్ సమృద్ధిగా లభ్యత కాగలదు. అనేక గ్రామాలకు, ఇప్పటికీ విద్యుత్ సరఫరా లేదు. అలాంటప్పుడు పంపిణీతో పాటు, లభ్యత కూడా సవాల్ కానుంది. ముందుగా దేశంలో నిరంతర విద్యుత్ ఉత్పత్తి కోసం కృషి జరగాలి. ఉన్న విద్యుత్‌ను ఇప్పుడు సరఫరా చేయడానికే సరిపోదు. విద్యతు ఉత్పాదకత పెంచకుండా ఉచిత విద్యుత్ సాధ్యం కాదని కూడా పాలకులు తెలుసుకోవాలి. అయితే రైతుల ఆత్మహత్యలపై నివేదికలను పట్టించుకోవడం లేదు. అధికశాతం ప్రజల జీవనాధారమైన వ్యవసాయరంగం పట్ల, రైతుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. విద్యుత్ నియంత్రణ బిల్లుకు నడుం బిగించిన కేంద్రం రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తోందన్న విమర్శలు ఉన్నాయి. విద్యుత్ నియంత్రణ అంతా ఇక కేంద్రం చేతిలోకి వెళితే రాష్ట్రాలపై విద్యుత్ భారం తడిసి మోపెడు కానుంది. వ్యవసాయ రంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, అగ్రి బేస్డ్, ప్రాసెసింగ్ పై దృష్టి పెట్టామని, వంటనూనె గింజల ఉత్పత్తిపైనా ప్రధాని మోడీ గతంలో చేసిన ప్రకటన ఎలాంటి పురోగతి సాధించలేదు. ఎందుకంటే ఏడున్నరేళ్లుగా ఈ రంగంలో మార్పులు ఉంటే అన్నధాన్యాల ధరలు దిగి రావాలి. కానీ అలాంటి దేమీ లేదు. నిజానికి రైతులు ఉద్యమించడం వల్ల..మోడీ సాగుచట్టాలను ఉపసంహరించు కున్నారు. ఇప్పటికీ ధాన్యం కొనుగోళ్లు సాగక రైతులు ఆందోళనకు గురవుతున్నా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించు కోవడం లేదు. ఇంతకన్నా నిర్లక్ష్యం మరోటి ఉండదు. ఆరుగాలం కష్టించి పంటలు పండిస్తున్న రైతులు కాడి దించితే మనకు కడుపులో ముద్దకూడా దిగదని గుర్తించాలి. ఈ కార్పోరేట్ల ఉత్పత్తులు మన ఆకలి తీర్చవని తెలుసుకోవాలి. రైతులకు సంబంధించి తీసుకుంటున్న చర్యలు ఫలితం ఇవ్వడం లేదు. ఇలాంటి సందర్భంలో రైతులకు మేలు చేయాలనుకుంటే సాగుచట్టాలపై విస్తృతంగా దేశవ్యాప్తంగా కాకున్నా కనీసం పార్లమెంటులో చర్చ సాగేది. నిజానికి దేశంలో నూనెగింజల ఉత్పత్తి పెరిగితే నూనెధరల పెరుగుదల జరిగేది కాదు. అందుకే వ్యవసాయ రంగం పురోగమించ డానికి తీసుకుంటున్న చర్యలు మాత్రం గొప్పగా లేవనే చెప్పాలి. ప్రధానంగా దిగుబడులు తీవ్రంగా దెబ్బతీస్తున్నా వాటిని నిరోధించి, దేశీయంగా వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించడంలో కేంద్రం విఫలం అవుతోంది. వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను తగ్గించి, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, గిట్టుబాటు ధరలు కల్పించడం వంటివన్నీ మాటలకే పరిమితం అయ్యాయి. దేశంలో వ్యవసాయరంగం అత్యంత సంక్షోభంలో కూరుకుని పోయి ఉన్న సమయంలో ఈ భారీ దిగుమతులు జరగడం గమనార్హం. చెప్పాలంటే, ఇంత భారీ మొత్తం దిగుమతుల కోసం ఖర్చు చేయకుండా, భారతీయ రైతారగంపై ఖర్చు చేసి ఉంటే పరిస్థితి ఎంతోకొంత మెరుగుపడి ఉండేది. అన్ని ప్రభుత్వాలూ రైతన్నను ఆదుకోవడం గురించీ, వ్యవసాయాభివృద్ధి గురించీ గొప్ప ఉపన్యాసాలు, హామీలు ఇవ్వడంతోనే సరిపెడు తున్నాయనే విషయం వాస్తవ పరిస్థితులను గమనించినప్పుడు అర్థం అవుతుంది. కేవలం ఒక్క సంవత్స రంలోనే దేశీయ వ్యవసాయానికి కేటాయించిన బడ్జెట్‌కన్నా మూడు రెట్లు ఎక్కువగా ఆహార ధాన్యాలను మనం దిగుమతి చేసుకున్నామంటే, మన నేతలు ఆ రంగం పట్ల ఎంత శ్రద్ధ పెడుతున్నారో అర్థమవుతుంది. హరిత విప్లవం నుంచి లబ్ధిపొంది, ఆహార ధాన్యాలలో స్వయం సమృద్ధిని సాధించిన దేశం ఇప్పుడు ఆ ఫలాలను నిర్లక్ష్యంగా జారవిడుచుకుంటూ, ఆహార ధాన్యాల దిగుమతిదారు అవుతోంది. పసుపు విప్లవాన్ని అది కావాలని ధ్వంసం చేసిన కారణంగా ఏర్పడిన ఫలితాల నుంచి మనం ఎలాంటి పాఠాలనూ నేర్చుకోలేదు. వంట నూనెల విషయంలో ఈ విప్లవం కారణంగా స్వయం సమృద్ధి సాధించిన మనం దశలవారీగా దిగుమతి సుంకాన్ని దాదాపుగా సున్నాకు దించిన నేపథ్యంలో మార్కెట్లోకి దిగుమతి ఉత్పత్తులు వెల్లువలా వచ్చిపడ్డాయి. వంట నూనెలు 60 శాతం దిగుమతి చేసుకుంటున్నాం. పెరుగుతున్న ఆహార ధరలను నియంత్రించేందుకు దిగుమతులు అవసరమన్న వాదనను అడ్డం పెట్టుకొని, విధానకర్తలు చౌకైన, సబ్సిడీ ఇచ్చిన వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను అనుమతిస్తున్నారు. దేశంలో మంచి పంటలు పండి నప్పటికీ, దిగుమతులు వెల్లువలా వచ్చి పడుతున్నాయి. దిగుమతులు ఎంత ఎక్కువగా వచ్చి పడితే, అది అంతగా సన్నకారు రైతుల జీవనోపాధిపై వేటు పడుతుంది.

# అసెంబ్లీలో కాగ్ నివేదికను ప్రవేశపెట్టిన ఆర్థికశాఖ మంత్రి భట్టి

### బడ్జెట్ వివరాలను వివరించిన సర్కార్



హైదరాబాద్, మార్చి27: అసెంబ్లీ సమావేశాల్లో చివరిరోజు రేవంత్ రెడ్డి సర్కారు గురువారం కాగ్ నివేదికను ప్రవేశపెట్టింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫైనాన్స్ అకౌంట్స్, అప్రోప్రియేషన్ అకౌంట్స్‌పై కాగ్ నివేదిక సమర్పించగా దానిని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. ఇందులో 2023-24 బడ్జెట్ అంచనా రూ.2,77,690 కోట్లు కాగా, చేసిన వ్యయం రూ.2,19,307 కోట్లుగా చెప్పారు. గత ఐదేళ్లలో 4లక్షల 3వేల 664 కోట్ల అప్పులు చేసినట్టు సదరు కాగ్ రిపోర్టులో వెల్లడైంది. 2023-24 ఏడాదిలో పబ్లిక్ మార్కెట్ నుంచి రూ. 49,618 కోట్ల అప్పులు తీసుకున్నట్టు కాగ్ పేర్కొంది. గత ఏడాది కాలంలో 200 శాతం పరిధి పెరిగినట్లు తెలిపింది. పలు కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న అప్పు రూ.2 లక్షల 20 వేల కోట్లని వెల్లడించింది. వేతనాల కోసం రూ.26,981 కోట్లు ఖర్చు చేసినట్టు కాగ్ రిపోర్ట్‌లో వెల్లడైంది. ప్రభుత్వ ఖజానాకు పన్ను ఆదాయం నుంచే 61.89 శాతం నిధులు వస్తున్నాయని, 2023-24లో కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు రూ.9,934 కోట్లని కాగ్ వెల్లడించింది. రెవెన్యూ రాబడుల్లో 45% సర్కారీ ఉద్యోగుల వేతనాలకు తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లింపులు, పెన్షన్లకే ఖర్చవుతోందని నివేదికలో తెలిపింది. 2023-24లో రెవెన్యూ మిగులు రూ.779 కోట్లని, లోటు రూ49,977 కోట్లుని స్పష్టం చేసింది.

ప్రభుత్వ ఖజానాకు పన్ను ఆదాయం నుంచే 61.89 శాతం నిధులు వస్తున్నాయని, 2023-24లో కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు రూ.9,934 కోట్లని కాగ్ వెల్లడించింది. రెవెన్యూ రాబడుల్లో 45% సర్కారీ ఉద్యోగుల వేతనాలకు తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లింపులు, పెన్షన్లకే ఖర్చవుతోందని నివేదికలో తెలిపింది. 2023-24లో రెవెన్యూ మిగులు రూ.779 కోట్లని, లోటు రూ49,977 కోట్లుని స్పష్టం చేసింది. 2023-24లో స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు రూ.76,776 కోట్లు చెల్లింపులు జరిగాయని, 11% పెరుగుదల స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం నిధుల పెంపుదలగా చెప్పింది.

2022-24లో ప్రభుత్వం తీసుకున్న అప్పు రూ.53,144 కోట్లుగా కాగ్ వెల్లడించింది. బడ్జెట్ అంచనాలో 79 శాతం వ్యయం అయిందని, ఆమోదం పొందిన బడ్జెట్ కంటే అదనంగా అంచనాల్లో 33 శాతం ఖర్చు కాగా, ఇది రూ.1,11,477 కోట్లుగా కాగ్ నివేదికలో వెల్లడైంది.

# ఆహారధాన్యాల దిగుమతులు

### దేశీయంగా రైతుకు సవాల్

న్యూఢిల్లీ,మార్చి27 దేశంలో ఆహర ధాన్యాల దిగుమతులపై దృష్టి సారించాలి. అంతేగాకుండా సమీక్షించుకోవాలి. మనదేశంలో అన్నిరకాల ధాన్యం పండుతున్న దిగుమతులు చేసుకోవడం, ఇక్కడి రైతులకు భరోసా లేకుండా చేయడం సరికాదు. అలాగే ప్రజలకు కూడా సరసమైన ధరలకు ఆహారా ధాన్యలు దక్కడం లేదని గుర్తించాలి. రైతులను ప్రోత్సహించడం ద్వారా అన్నిరకాల పంటలు పండించే అవకాశం ఉన్న భూములను ఉపయోగిం చుకోవాలి. రైతులను ప్రోత్సహిస్తే అన్నిరకాలు పంటలు పండిస్తారు. అందుకు మన భూములు అనుకూలంగా ఉన్నాయి. గతంలో రికార్డు స్థాయిలో 97 మిలియన్ టన్నుల గోధుమ ఉత్పత్తి అయిన నేపథ్యంలో, కేవలం 8 లక్షల టన్నుల గోధుమలను ఉక్రెయిన్, రష్యా నుంచి జీరో డ్యూటీతో దిగుమతి చేయడం ఆర్థికంగా అర్థరహితం. రైతులు గిట్టుబాటు ధర లేక ఉల్లిపాయలను వీధుల్లో పారేసిన ఘటనలు ఇంకా మనం మర్చిపోలేదు. ఇదిలా ఉండగా, గతంలో పండుగల సమయంలో ప్రభుత్వం 3 లక్షల టన్నుల చక్కెరను 25 శాతం డ్యూటీని తగ్గించి మరీ దిగుమతి చేసుకునేందుకు అనుమతించింది. పప్పు ధాన్యాలు దేశంలో విరగపండిన సమయంలో అది జరిగిందని నివేదిక వివరించింది.

దీనితో ధరలు పడిపోయి, రైతులు అత్యంత చౌకగా తమ ఫలసాయాన్ని అమ్ముకోవలసి వచ్చింది.ఒక్క శనగ పప్పు మినహా మిగిలిన పప్పు ధాన్యాలు అన్నింటిపై రైతులకు లాభంలో మార్జిన్ 30 శాతం పడిపోయింది.

ఇదే తరహా ధరలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దేశంలో ఈసారి పండిన పెసర, కందిపప్పుకు కొనుగోలు దారులు లభ్యం కావడం లేదు. హోల్ సేల్ ధరలు పెరగకపోవడంతో పరిస్థితి ఆశాజనకంగా లేదు. భారత దేశం ఇప్పటికే లక్షల టన్నుల పప్పు ధాన్యాలను మొజాంబిక్ నుంచి దిగుమతి చేసుకునేందుకు ఒప్పందంపై సంతకాలు చేసింది. రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా నుంచి పప్పు ధాన్యాలు, నూనె గింజలను దిగుమతి చేసుకునే ందుకు సంప్రదింపులు జరుపుతోంది. అమెరికా వ్యవసాయ శాఖ భారత్ సోయాబీన్ దిగుమతులను పెంచుకోవాలని సూచించ డంతో, వంట నూనెల దిగుమతులపై పెంచిన సుంకాన్ని గణనీయంగా తగ్గించడమంటే, వ్యవసాయ ఔట్‌సోర్సింగ్ అనేది మినహాయింపుగా కాక విధానమైపోయింది. ఇది మన ఆహార స్వయం పోషకత్వానికే కాదు కోట్లాది సన్నకారు రైతుల జీవనోపాధికి ముప్పుగా పరణమి ంచింది. ఇలాంటి విధానాలను సమీక్షించుకోవాల్సిన సమ యంఉంది. అప్పుడేరైతులకు మేలు జరుగు తుంది. ఆహారాన్ని దిగుమతి చేసుకోవడం అంటే నిరుద్యోగాన్ని దిగుమతి చేసుకోవడమే అన్న వాదనలో వాస్తవం గ్రహిచాలి. చౌకైన దిగుమతులను అనుమతించడమంటే, వ్యవసాయం నుంచి రైతులను బలవంతంగా బయిటకు పంపడమే.

పంటలు దిగుబడులు సమయంలో దిగుమతులు వెల్లవలా వచ్చిపడటాన్ని ఎలా సమర్థించుకుంటారు. అందువల్ల ధాన్యం ఉత్పత్తి, దిగుమతులు, ఎగుమతులు తదితర అంవాలపై స్పష్టమైన వ్యయసాయ విధానం రూపొందించుకుటే తప్పమనం సంక్షోభం నుంచి బయటకురాలేం.

# ముగిసిన రెండ్రోజుల కలెక్టర్ల సదస్సు

### క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కార బాధ్యత



అమరావతి,మార్చి27: రెండ్రోజుల కెలక్టర్ల సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వేసవి మంచినీటి ఎద్దడి సహా అనేక నిర్ణయాలు తీసుకున్నారు. కలెక్టర్లు ప్రధానంగా క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సిఎం చంద్రబాబు సూచించారు. విధానపర నిర్ణయాలను పక్కన పెట్టి సాధారణ సమస్యల విషయంలో తోణ చర్యలకు ఉపక్రమించాలని వారికి దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో ఆదాయం పెంచే విషయాలపైనా వారికి లక్ష్యాలను ఇధించారు. ఖజానాను నింపే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లపైన పెడుతోంది. కలెక్టర్ల సదస్సు రెండోరోజైన బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ అంశంపైనే ప్రధానంగా దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్లు కూడా తమ జిల్లాల్లో ఆదాయ సముపార్జనకు ఉన్న అవకాశాలను, తీసుకునే చర్యలను వివరించారు. మొండి బకాయిల వసూళ్లలో అవసరమైతే కలెక్టర్లు సంబంధిత శాఖలకు సహకరించాలని, ఈ విషయంలో కఠినసగా వ్యవహరించాలని సిఎం సూచించినట్లు తెలిపింది. గనులకు అనుమతులు, నిబంధనలను అతిక్రమించి తవ్వకాలు జరుపుతుండడం, ఇసుక తవ్వకాల్లో డీసిల్టేషన్ విధానం వంటి వాటిని కూడా సక్రమంగా అమలు చేసి ఆదాయానికి గండి పడకుండా చూడాలని భావిస్తున్నారు. ఆదాయానికి ఏఐ జిల్లాల్లో ఆదాయం తగ్గకుండా చూసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సు వినియోగించుకునే అంశం కూడా చర్చకు వచ్చింది. ఎక్కడ నుంచి ఎంత ఆదాయం రావాల్సి ఉంటుంది,

ఎంత వస్తోందన్నది కూడా ఏఐ సహకారంతో గుర్తించవచ్చునని, అందుకే ఈ విధానంపైనా దృష్టి సారించాలని దిశానిర్దేశర చేసినట్లు- తెలిసింది. అదే విధంగా వృత్తి పన్నును పెంచాలన్న ప్రతి పాదనల నేపథ్యంలో జిల్లాలలో కూడా దీనిపై దృష్టి సారించాలని చెప్పినట్లు సమాచారం. ఆస్తి పన్ను వసూళ్లను కూడా సీరియస్ గా తీసుకోవాలని, అవసరమైతే చర్యలకు ఉపక్రమిం చాలని కూడా కలెక్టర్లకు సిఎం సూచించినట్లు తెలిసింది. వ్యాపార, వాణిజ్య సంస్థలు, వ్యక్తుల నుంచి జిఎస్టి బకాయిలు పెరుగుతున్నాయని, వాటిని పూర్తిగా వసూలు చేసేందుకు కూడా సహకరించాలని కోరారు. జిల్లాలో పలు హోటళు రెస్టారెంట్లు రిజిస్ట్రేషన్ కూడా చేసుకోకుండా నడుస్తున్నాయని, వాటిని తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చూడాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఏడాదిలోగా ఈ దిశలో చర్యలు తీసుకుంటామని పలువురు కలెక్టర్లు హామీ ఇచ్చారు. గనులకు సంబంధించి కూడా దృష్టి పెట్టాలని నిర్ణయించారు.




## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఒడిదుడుకుల నడుమ చివరికి ఇవాళ లాభాల్లో ముగిశాయి. లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఇవాళ లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన మార్కెట్లు వెంటనే కోలుకొని లాభాల దిశగ పరుగులు తీశాయి. అయితే, తర్వాత తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంది. దాదాపు అంతర్జాతీయ మార్కెట్లన్నీ నష్టాలు నమోదు చేయగా మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. అయితే, ప్రధాన షేర్లలో కొనుగోళ్ల మద్దతు లాభాల బాటలో ముందుకు సాగేందుకు దోహదం చేశాయి.మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 317.93 పాయింట్లు లాభంతో 77,606.43 వద్ద ముగియగా, నిఫ్టీ 105.10 పాయింట్ల లాభంతో 23,591.95 దగ్గర క్లోజ్ అయింది. అటు ఆసియా మార్కెట్లు కూడా నష్టాల్లో ముగిశాయి. జపాన్ నిక్కీ 0.81



శాతం నష్టంతో ముగియగా, హాంకాంగ్ హాంగెసెంగ్ 0.41 శాతం లాభంతో ముగిసింది.

## లాభాల్లో ట్రేడవుతున్న స్టాక్ మార్కెట్ సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మొదట నష్టాల్లో ప్రారంభమైనా ఆ తర్వాత లాభాల దిశగా పయనించి మళ్లీ ఒడిదుడుకులు మధ్య ఊగిసలాడుతున్నాయి. లాభాల్లో ట్రేడవుతున్న స్టాక్ మార్కెట్ సూచీలు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాల మధ్య కదలాడుతున్నాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన మార్కెట్లు వెంటనే కోలుకొని లాభాల దిశగా పరుగులు తీశాయి. అయితే, పదిన్నర సమయంలో కొంతమేర ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ముందుకు సాగుతోంది. దాదాపు అంతర్జాతీయ మార్కెట్లన్నీ నష్టాలు నమోదు చేయగా మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండటమే దీనికి కారణం కావొచ్చు. అయితే, ప్రధాన షేర్లలో కొనుగోళ్ల మద్దతు లాభాల బాటలో ముందుకు సాగేందుకు దోహదం చేస్తున్నాయి. ఉదయం 11:00 గంటల సమయంలో సెన్సెక్స్ 392 పాయింట్లు లాభంతో 77,680 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ 112 పాయింట్ల లాభంతో 23,600 వద్ద ఉన్నాయి.అమెరికా మార్కెట్లు నిన్న నష్టాల్లో ముగిశాయి.

ఎస్అండ్‌పీ సూచీ 1.12 శాతం, నాస్‌డాక్ 2.04 శాతం నష్టపోయాయి. డౌజోన్స్ ఫ్లాట్‌గా ముగిసింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతు న్నాయి. జపాన్ నిక్కీ 1.00 శాతం నష్టంతో 375 పాయింట్ల దగ్గర ట్రేడవుతుంటే.. హాంకాంగ్ హాంగెసెంగ్ 0.93 శాతం లాభంతో ముందుకు సాగుతోంది.

విదేశీ సంస్థాగత మదుపర్లు నిన్న రూ.2,241 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేశారు. దేశీయ సంస్థాగత మదుపర్లు నికరంగా రూ.696 కోట్ల మేర షేర్ల అమ్మకాలు జరిపారు

## రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి మరో సూపర్ బైక్..

### ధర, స్పెషల్ ఫీచర్స్ ఎలా ఉన్నాయంటే..



రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి బైక్ ప్రియులు చాన్నాళ్ల నుంచి ఎదురుచూస్తున్న మరో సూపర్ బైక్ మార్కెట్లోకి వచ్చేసింది. 650 సిరీస్‌లో భాగంగా గురువారం లాంఛ్ అయిన క్లాసిక్ 650 బుకింగ్ ఈ రోజు నుంచే ప్రారంభమైంది. రూ. 3.37లక్షల (ఎక్స్-షోరూమ్) ప్రారంభ ధరతో దీన్ని విడుదల చేశారు. ఇందులో బ్లాక్ క్రోమ్ వేరియంట్ ధర అత్యధికంగా రూ. 3.50 లక్షలుగా రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 650 ఇంజిన్‌లో పెద్దగా మార్పుల్లేవు. నియో రెట్రోలుక్‌ను కొనసాగించారు. క్లాసిక్ 350లాగే ఉండే ఈ బైక్‌లో 647 ఎయిర్/ఆయిల్-కూల్డ్ ప్యారలల్ ట్విన్ ఇంజన్ ఉంది.46.4 పవర్, 52. టార్క్ పవర్ ఉత్పత్తి చేసే అదే 648ప్యారలల్-ట్విన్ ఇంజిన్‌తో శక్తిని పొందుతుంది. ఈ యూనిట్ 6-స్పీడ్ గేర్‌బాక్స్‌కి జత చేశారు. 19 ఫ్రంట్ వీల్, 18 రియర్ వీల్ అమర్చారు. వైర్ స్పోక్ వీల్స్ ఏర్పాటు చేశారు.ఫీచర్ల గురించి మాట్లాడుకుంటే దీనికి లైట్లు, సెమీ అనలాగ్ ఇన్‌స్ట్రుమెంట్ కన్సోల్, స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీతో ట్రిప్పర్ నావిగేషన్ పాడ్, టైప్-సి ఛార్జింగ్ పోర్ట్, డ్యూయల్-ఛానల్ సహా అనేకం ఉన్నాయి. బ్రంటింగ్‌థార్ప్ బ్లూ, టీల్, బ్లాక్ క్రోమ్, వల్లం రెడ్ రంగుల్లో ఈ బైక్ దొరుకుతుంది.

## ఆర్సీబీపై ఆడటం గొప్పగా ఉంటుంది

### సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్



ఐపీఎల్ 2025లో భాగంగా మరో రసవత్తర పోరుకు రంగం సిద్ధమవుతోంది. సీఎస్కే - ఆర్సీబీ జట్లు హోరాహోరీగా తలపడనున్నాయి. ఈ సందర్భంగా సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్.. మ్యాచుకు ముందు కీలక కామెంట్స్ చేశాడు. ఆర్సీబీ స్టార్ విరాట్ కోహ్లీతో తలపడితే ఎలా ఉంటుందో వివరించాడు.జియోస్టార్ స్టార్ నహీ ఫార్‌లో రుతురాజ్ గైక్వాడ్ మాట్లాడుతూ.. "ఆర్సీబీతో మ్యాచ్ ఆడేందుకు నిజంగా ఎక్సైటింగ్ గా ఉన్నాను. ముఖ్యంగా ఆర్సీబీ కొత్త కెప్టెన్ రజత్ పటీదార్ పై ఆడేందుకు రెడీగా ఉన్నాను. రజత్ పటీదార్ ను సారథిగా ఎంపిక చేసి ప్రకటించినప్పుడు వెంటనే నేను అతడికి మెసేజ్ చేసి అభినందించాను. మేం గత కొన్నేళ్లుగా మంచి స్నేహితులుగా ఉన్నాం. ఒకరినొకరు బాగా తెలుసు. పైగా ఆర్సీబీ బలమైన జట్లలో ఒకటి." అని చెప్పుకొచ్చాడు. ఆ తర్వాత విరాట్ కోహ్లీతో తలపడటం ఎలా ఉంటుందో వివరించాడు సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్. "వాళ్లు ప్రతిఏడాది గొప్పగానే చేస్తారు. ఈ ఏడాది కూడా గొప్పగానే ప్రారంభించారు. అయితే ప్రత్యర్థి జట్టులో విరాట్ కోహ్లీ ఉంటే, బరిలోకి దిగి ఆడుతుంటే, అతడితో మరింత తలపడాలనే ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. మ్యాచ్ ఆసక్తికరంగా ఉంటుంది. చాలా కాలం నుంచి అతడు అద్భుతంగా ఆడుతున్నాడు. ఆర్సీబీ, దేశం తరపున నిలకడగా అద్భుతంగా ఆడుతున్నాడు. కాబట్టి ఆర్సీబీపై ఆడటం గొప్పగా ఉంటుంది. అందుకే ముంబయి ఇండియన్స్ తర్వాత మేం అత్యంత ఎక్కువ ఆసక్తిగా ఎదురుచూసే రెండో మ్యాచ్ ఇదే" అని రుతురాజ్ పేర్కొన్నాడు.

## ముంబైలో నివాసం విషయంలో వచ్చిన విభేదాలే కారణమా!




యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ విడాకులపై చర్చ

టీమిండియా క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ ఇటీవలె తన మాజీ భార్య ధనశ్రీ వర్మతో విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం అతను ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు తరపున ఆడుతూ బిజీ ఉన్నాడు. అయితే.. కోర్టులో పరస్పర అంగీకరంతో విడిపోతున్నట్లు ఈ చాహల్, ధనశ్రీ ప్రకటించినప్పటికీ.. వారి విడాకులకు ఒక బలమైన కారణం ఉందనే సంచలన విషయం తాజాగా బయటపడింది. అసలు విషయం ఏంటంటే.. 2020లో చాహల్, ధనశ్రీ వర్మ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి ధనశ్రీ హర్యానాలోని చాహల్ ఇంట్లో భర్త, అత్తమామలతోనే కలిసి ఉంటుంది. డ్యాన్స్ షోలతో పాటు ఇతర అత్యవసర పనులు ఉన్న టైమ్‌లో హర్యానా నుంచి ముంబైకి వెళ్లి వస్తూ ఉంటుంది. ఈ క్రమంలోనే మనం ముంబైలోని ఉందామని చాహల్‌ను కోరింది ధనశ్రీ. కానీ, అందుకు చాహల్ ఒప్పుకోలేదు. తన తల్లిదండ్రులతో పాటు ఇక్కడే హర్యానాలోనే



ఉండాలని అనుకుంటున్నట్లు చెప్పాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య విభేదాలకు కారణం అయింది. తల్లిదండ్రులతో కలిసి హర్యానాలోనే ఉందామని చాహల్, లేదు.. మనం ముంబైలో వేరే కాపురం పెడదామంటూ ధనశ్రీ పట్టుబట్టారు. ఎక్కడ ఉండాలనే విషయంలో ఇద్దరి మధ్య ఏకాభ్రియం రాకపోవడంతో.. విడాకులు తీసుకోవాలని ఫిక్స్ అయ్యారు. అందుకోసం ఫ్యామిలీ కోర్టులో విడాకులకు అప్లై చేయగా.. వారికి కోర్టు ఆరు నెలల కూలింగ్ పిరియడ్ ఇచ్చింది. కానీ, ఫ్యామిలీ కోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. తమకు వెంటనే విడాకులు కావాలని, తాము రెండేళ్లుగా విడివిడిగానే జీవిస్తున్నామంటూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు వీరికి విడాకులు మంజూరు చేసింది. ఇలా వేరే కాపురం పెట్టాలనే ఆలోచన ఇద్దరి మధ్య వివాదానికి కారణమై.. చివరికి విడిపోయేలా చేసిందని విశ్వసనీయ సమాచారం. అయితే విషయంపై అటు ధనశ్రీ కానీ, చాహల్ కానీ లేదా వారి కుటుంబ సభ్యులు కానీ ఈ విషయంపై స్పందించలేదు. ఇద్దరు పరస్పర అంగీకారంతోనే విడిపోతున్నట్లు విడాకుల పిటీషన్‌లో పేర్కొన్నారు.

## ఇండియా-ఏ తరపున ఆడనున్న కోహ్లీ, రోహిత్ శర్మ!



టీమిండియా ఆటగాళ్లంతా ప్రస్తుతం ఐపీఎల్‌తో ఫుల్ బిజీగా ఉన్నారు. ప్రతీ రోజు మ్యాచ్‌తో క్రికెట్ ఫ్యాన్స్ కూడా ఐపీఎల్ ఫీవర్‌తో ఊగిపోతుండగా.. మరోవైపు బీసీసీఐ ఓ షాకింగ్ నిర్ణయం తీసుకుంది. టీమిండియా స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను ఇండియా-ఏ తరపున ఆడాల్సిందిగా కోరే ఆలోచనలో బీసీసీఐ ఉన్నట్లు సమాచారం. అదేంటి.. ఈ దిగ్గజ క్రికెటర్లు ఎందుకు ఇండియా-ఏ జట్టు తరపున ఆడాలి? అని అనుకుంటున్నారా? అందుకు ఓ కారణం ఉంది. ఐపీఎల్ ముగిసిన తర్వాత టీమిండియా ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల లాంగ్ సిరీస్ ఆడేందుకు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. జూన్ 20 నుంచి ఈ టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది.2025-27 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్ ఈ సిరీస్ నుంచి ప్రారంభం అవుతుంది. డబ్ల్యూటీసీ సైకిల్‌లో ఎంతో కీలకమైన ఈ సిరీస్‌లో టీమిండియా ఎలాగైన మంచి ప్రదర్శన చేయాలని బీసీసీఐ భావిస్తోంది. అందుకోసమే ఈ సిరీస్ కోసం భారత ఆటగాళ్లను రెడీ చేసేందుకు బీసీసీఐ ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే ఈ సిరీస్‌కు ముందు, ఇండియా-ఏ జట్టును మే 30 నుండి రెండు టూర్ మ్యాచ్‌ల కోసం ఇంగ్లండ్ కు పంపనుంది. మొదటి నాలుగు రోజుల మ్యాచ్ మే 30 నుండి కాంటర్‌బరీలోని సెయింట్ లారెన్స్‌లోని స్పిట్‌ఫైర్ గ్రౌండ్‌లో జరుగుతుంది. రెండవ మ్యాచ్ ఒక వారం తర్వాత జూన్ 6న నార్తాంప్టన్‌లోని కౌంటీ గ్రౌండ్‌లో ప్రారంభం కానుంది. ఈ రెండింటిలో తొలి మ్యాచ్‌లో ఇండియా-ఏ జట్టులో సీనియర్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఉండే ఛాన్స్ ఉంది. రెడ్ బాల్ క్రికెట్‌లో గత కొంతకాలంగా ఈ సీనియర్ క్రికెటర్లు సరైన ప్రదర్శన చేయలేదు. ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో కోహ్లీ ఒక సెంచరీ చేసినప్పటికీ.. పెద్దగా ప్రభావం చూపలేదు. కేవలం 23.75 యావరేట్‌తో బ్యాటింగ్ చేశాడు. ఇక రోహిత్ అయితే దారుణంగా విఫలం అయ్యాడు. ఒక మ్యాచ్‌కు తనే స్వయంగా దూరంగా ఉన్నాడు. వీరిద్దరూ ఇంగ్లండ్ సిరీస్‌లో ఎంతో కీలకం. వీరిని ఫామ్‌లోకి తీసుకొచ్చేందుకే బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# వరుస సినిమాలతో హిట్ కొట్టేస్తున్న రష్మిక



నేషనల్ క్రష్ రష్మిక మందన్నా.. ప్రస్తుతం వరల్డ్ వైడ్ మారుమోగుతున్న పేరు. యానిమల్, పుష్ప 2 సినిమాతో బ్లాక్ బస్టర్స్ అందుకున్న ఈ బ్యూటీ.. ఇటీవలే ఛావా సినిమాతో మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. దీంతో గత రెండేళ్లలో మూడు పాన్ ఇండియా చిత్రాలకు ఏకంగా రూ.3 వేల కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. అంతేకాదు.. ప్రస్తుతం తెలుగుతోపాటు హిందీలోనూ వరుస సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది ఈ అమ్మడు. ఇటీవలే సికందర్ సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో సల్మాన్ ఖాన్ నటించిన ఈ మూవీకి మంచి రెస్పాన్స్ వస్తుంది. ఇదిలా ఉంటే.. ఇటీవల పోర్బ్స్ నివేదిక రష్మిక సంపాదనను బయటపెట్టింది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం.. రష్మిక ఆస్తులు రూ.66 కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం. అలాగే ఒక్కో సినిమాకు దాదాపు రూ.10 కోట్ల వరకు వసూలు చేస్తుందట. ఇదిలా ఉంటే.. సాధారణంగా సినీరంగంలో హీరోహీరోయిన్స్ ఖరీదైన స్వాంకీ కార్లలో దిగడం కొందరు బాలీవుడ్ స్టార్లకు సాధ్యం అని భావిస్తాం.. తాజాగా నేషనల్ క్రష్ సైతం ఖరీదైన కారుకు ఓనర్ అయ్యింది. ఇటీవలే ఆమె మెర్సిడెస్ బెంజ్ ఎస్ 450ని కొనుగోలు చేసింది. ఈ కారు ధర దాదాపు రూ.2 కోట్లకు పైగా ఉంటుందని టాక్. నిజానికి సినీతారలకు ఆటోమొబైల్స్ పట్ల ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. చాలా మంది తారలు రోల్స్ రాయిస్, లంబోర్గినీ, మే బ్యాక్ వంటి ఖరీదైన కార్లలో సందడి చేస్తుంటారు. ఇక ఇప్పుడు రష్మిక సైతం లగ్జరీ కారులో షికారు చేస్తూ ఎక్కడా తగ్గడం లేదు. ప్రస్తుతం రష్మిక గ్యారేజీలో 5 రకాల లగ్జరీ బ్రాండ్ కార్లు ఉన్నాయి. ఈ కార్ల కోసం కోట్లాది రూపాయలను వెచ్చిస్తోంది.యంగ్ బ్యూటీ శ్రీలీల గురించి ఎంత చెప్పినా తక్కవే. ఈ నటి తన అందంతో ఎంతో మంది మదిని దోచింది. పెళ్లిసందడి  సినిమాతో తెలుగు వెండితెరపైకి అడుగు పెట్టి తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. అంతే కాకుండా మొదటి సినిమాతోనే మంచి ఫ్యాన్ బేస్ సొంతం చేసుకుంది ఈ నటి. ఈ మూవీ తర్వాత శ్రీలీలకు వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయి.



ముఖ్యంగా రవితేజ ధమాక సినిమాతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ సినిమాలో ఈ అమ్మడు డ్యాన్స్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. ఇక ఈ సినిమా తర్వాత శ్రీలీల గుంటూరు కారం, స్కంద, భగవంత్ కేసరి, ఎక్స్ టార్డినరీ బ్యాన్ ఇలా వరస సినిమాలు చేసింది. కానీ ఈ ముద్దుగుమ్మకు అదృష్టం మాత్రం కలిసి రాలేదనే చెప్పాలి. వరసగా ఆఫర్స్ వచ్చినా అవి బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అవ్వడంతో ఒక్కసారిగా శ్రీలీల క్రేజ్ తగ్గిపోయింది. దీంతో అవకాశాలు కూడా అంతగా లేకపోవడంతో ఈ అమ్మడు కాస్త సైలెంట్ అయ్యింది. పుష్ప 2 సినిమాలో కిసక్కి అంటూ తన డ్యాన్స్ గ్లామర్‌తో తెలుగు అభిమానులను పలకరించిన శ్రీలీల మరోసారి రాబిన్ హుడ్ మూవీ ద్వారా థియేటర్లో సందడి చేయడానికి రెడీ అయిపోయింది.

# ఎన్టీఆర్‌తో తెలుగులో మాట్లాడిన జపాన్ అభిమాని






టాలీవుడ్ అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం దేవర ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ చిత్రం జపాన్‌లో మార్చి 28న గ్రాండ్‌గా విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా మూవీ ప్రమోషన్స్ కోసం జపాన్ వెళ్లిన తారక్ అక్కడి మీడియాతో ప్రమోషన్స్‌లో పాల్గోంటున్నాడు. అయితే ప్రమోషన్స్ అనంతరం అభిమానులను కలుసుకున్న తారక్‌కి ఒక లేడి అభిమాని షాక్ ఇచ్చింది. ఆమె తారక్ వద్దకి వచ్చి.. తారక్ అన్న నేను ఆర్ఆర్ఆర్ సినిమా చూసి తెలుగు నేర్చుకున్నాను. నేను మీతో తెలుగులో మాట్లాడలని రెండు ఏండ్ల నుంచి ఈ తెలుగు బుక్‌ని పట్టుకుని తిరుగుతున్నాను. మీరు నా లైఫ్‌కి స్ఫూర్తి.. అని ఆమె చెప్పాగా.. తారక్ మాట్లాడుతూ.. మీరు మా అందరికీ పెద్ద స్ఫూర్తి అంటూ ఆ అభిమానికి ఆటోగ్రాఫ్‌ని ఇచ్చిన వీడియోను పంచుకున్నాడు. నేను జపాన్ వెళ్లిన ప్రతిసారి నాకు అందమైన జ్ఞాపకాలను అంది స్తుంది. కానీ ఈసారి పరిస్థితి కాస్త భిన్నంగా ఉంది. ఒక జపనీస్ అభిమాని నాతో సినిమా చూసిన తర్వాత తెలుగు నేర్చుకున్నానని చెప్పడం నన్ను నిజంగా కదిలించింది. సినిమా, భాషల పట్ల ప్రేమికుడిగా ఉన్న నాకు, ఒక సినిమా రెండు సంస్కృతుల మధ్య సేతువుగా పనిచేసి, ఒక అభిమానిని ఒక కొత్త భాష నేర్చుకునేలా ప్రేరేపించడం అనేది నేనెన్నటికీ మరచిపోలేని విష యం. భారతీయ సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రయాణిస్తూ ఇలాంటి అద్భుతాలను సృష్టిస్తుండటం మరోసారి దాన్ని జరుపుకోవడానికి కారణం అయింది. జపనీస్ అభిమాని నాతో తెలుగులో మాట్లాడినప్పుడు,
ఆమె కళ్లలో పట్ల ఉన్న ఆరాధన.. తెలుగు భాష పట్ల ఆమె చూపిన అంకితభావం నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తాయి. ఒక సినిమా కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా, భాషలను, సంస్కృతులను కలపడానికి ఇంతటి శక్తిని కలిగి ఉంటుందని ఆ క్షణంలో నేను గ్రహించాను. ఇది నా జపాన్ పర్యటనలోనే అత్యంత ప్రత్యేకమైన అనుభవంగా మిగిలిపోయిందంటూ తారక్ రాసుకోచ్చాడు.

# గేయ్ మార్చేసిన ధన్య బాలకృష్ణ



ధన్య బాలకృష్ణ.. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే.. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీల్లో ఎన్నో చిత్రాల్లో సహాయ నటిగా కనిపించింది. చాలా కాలంగా తెలుగులో కనిపించలేదు. ఇప్పుడు మరోసారి తెలుగులో సినిమా చేసి మెప్పించనుంది. ధన్య బాలకృష్ణ నటించిన బాపు సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ధన్య బాలకృష్ణ ఎక్కువగా సైడ్ రోల్స్ చేసింది. పేరుకు సైడ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించినా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది నటి ధన్య బాలకృష్ణ. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, సాఫ్ట్‌వేర్ సుధీర్ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుందీ ముందుగుమ్మ. నటన, అందంతో ఆకట్టుకుంటూ మంచి గుర్తింపు సంపాదించుకుంటుంది. వరుస అవకాశాలను సొంతం చేసుకుంటూ దూసుకెళుతోంది. తెలుగులో సాఫ్ట్ వేరు సుధీర్, నేను శైలజ, రాజు గారి గది, కార్బన్ వంటి చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. అటు వెండితెరపైనే కాకుండా డిజిటల్ ప్లాట్ ఫాంలోనూ పలు వెబ్ సిరీస్ చేస్తూ రాణిస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటుంది ఈ చిన్నది తాజాగా దాన్యబాలకృష్ణ ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

# నితిన్‌కు క్షమాపణలు చెప్పిన ఆది పినిశెట్టి





టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ నటించిన తాజా చిత్రం రాబిన్ హుడ్. ఛలో, భీష్మ చిత్రాలను తెరకెక్కించిన వెంకీ కుడుముల ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఎక్స్‌ట్రార్డీనరి మ్యాన్ తర్వాత నితిన్ తో మరోసారి జత కట్టింది శ్రీలీల. అలాగే ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాలో క్యామియో రోల్ పోషించన ున్నాడు. ఇక కేతిక శర్మ స్పెషల్ సాంగ్ లో సందడి చేసింది. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న రాబిన్ హుడ్ సినిమా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నితిన్ సినిమాకు ఆల్ ది బెస్ట్ చెప్పాడు మరో నటుడు ఆది పిని శెట్టి. అదే సమయంలో ఒక విషయంలో తనను క్షమించాలని నితిన్ ను కోరాడు. ఈ మేరకు ఆది పినిశెట్టి చేసిన ట్వీట్ ఇప్పుడు వైరలవుతోంది. గత నెలలో ఆది పినిశెట్టి హీరోగా నటించిన శబ్దం సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ సినిమాలో లక్ష్మీ మేనన్ హీరోయిన్ గా నటించింది. ఆకట్టుకునే కథా, కథనాలు, విజువల్స్, బీజీఎమ్ ఇలా శబ్దం సినిమాలో చాలా పాజిటివ్ అంశాలు ఉండడంతో ఆడియెన్స్ ను బాగానే మెప్పించింది. అయితే శబ్దం సినిమా రిలీజ్ టైమ్ లో నితిన్ ఒక ట్వీట్ చేశాడు. అయితే తన సినిమా ప్రమోషన్ల లో బిజీగా ఉన్న ఆది పినిశెట్టి నితిన్ ట్వీట్ కు రిప్లై ఇవ్వలేకపోయాడట. ఈ క్రమంలోనే నితిన్ సినిమా రాబిన్ హుడ్ సినిమా రిలీజ్ నేపథ్యంలో ఆది పినిశెట్టి ట్వీట్ పెట్టాడు. నితిన్ కు సారీ చెబుతూ రిప్లై ఇచ్చాడు. '

# విక్రమ్ సినిమాకు ప్రమోషన్ నిల్

## ఆశాజనకంగా లేని కలెక్షన్లు

చియాన్ విక్రమ్ తమిళ హీరో అయిన తెలుగులోను ఆయనకి విపరీతమైన ఫాలోయింగ్ ఉంది. విక్రమ్ సినిమాలని ప్రేక్షకులు ఎంతో ఆదరిస్తుంటారు. అయితే అపరిచితుడు తరువాత మళ్లీ విక్రమ్ ఆ రేంజ్ సక్సెస్ చూడలేకపోతోన్నాడు. ఇటీవల విక్రమ్ చేసిన ప్రయోగాలన్నీ కూడా విఫలం అయ్యాయి. తంగలాన్ అంటూ విచిత్ర ప్రయోగం చేసి చాలా కష్టపడ్డాడు. కాని ఆ సినిమాకి రావల్సినంత గుర్తింపు రాలేదు, మూవీ కూడా సక్సెస్ కాలేదు. అయితే తాజాగా విక్రమ్ హీరోగా అరుణ్ కుమార్ వీర ధీర శూరన్ అనే చిత్రాన్ని తెరకెక్కించారు. తెలుగులో వీర ధీర శూర అనే టైటిల్‌తో వచ్చింది. అయితే ఈ రోజు ఉదయం థియేటర్లలో విడుదల కావలసిన ఈ సినిమాకు ఢిల్లీ హైకోర్టు షాక్ ఇచ్చింది. విడుదలపై మధ్యంతర నిషేధం విధించడంతో ఉదయం 9 గంటలకు పడాల్సిన షోలు అన్నీ క్యాన్సిల్ అయ్యాయి. 'వీర ధీర శూర పార్ట్ 2' చిత్రాన్ని హెచ్.ఆర్




పిక్చర్స్ పతాకం మీద రియా శిబు ప్రొడ్యూస్ చేయగా, ఈ మూవీ రిలీజ్ మీద స్టే కోరుతూ ముంబైకు చెందిన ప్రొడక్షన్ కంపెనీ బీ4యు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. చిత్ర నిర్మాణ సంస్థ తమకు శాటిలైట్ హక్కులను విక్రయించిందని, అయితే ఒప్పందం ప్రకారం విడుదలకు ముందు సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ (ఓటిటి) హక్కులను విక్రయించకూడదు.

Printed Published and owned by Polagoni Rajesh Printed at PMRPublications, Ranga Reddy (Dist), Telangana 50150. at H.No 4-136/12,Journalist colony, Turkayamjal,Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh. www.sai suryaadaily.com